హోలీ... రంగేళి!

- ఆరోగ్య సూత్రమే అసలు రహస్యం
- రసాయనిక రంగులతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం
- నేడు హోలీ పండగ

-7లో



ఏయూ మాజీ వీసీ

ప్రసాదరెడ్డిపై విచారణ

- వైసీపీ హయాంలో ప్రసాదరెడ్డి సాగించిన అడ్డగోలు వ్యవహారాలను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యేలు పల్లా, వెలగపూడి, విష్ణుకుమార్‌రాజు
- విజిలెన్స్‌తో విచారణ జరిపిస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటన

మాజీ వీసీపై అనేక ఆరోపణలు

- అడ్డగోలుగా నియామకాలు, అస్మదీయులకు కీలక పదవులు, నిధులు దుర్వినియోగం, పీహెచ్‌డీ ప్రవేశాల్లో నిబంధనల ఉల్లంఘన...
- వీసీ కార్యాలయాన్ని వైసీపీ ఆఫీస్‌గా మార్చేశారనే విమర్శలు



ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): **ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి అక్రమాలు, అడ్డగోలు నిర్ణయాలపై ప్రభుత్వం విచారణ జరిపించేందుకు సిద్ధమైంది. వైసీపీ హయాంలో ప్రసాదరెడ్డి తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన నియామకాలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ నిర్వహించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ నేపథ్యంలో గురువారం అసెంబ్లీలో నగరానికి చెందిన ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజులు ప్రసాదరెడ్డి హయాంలో వర్సిటీలో జరిగిన అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాలపై ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా విచారణ జరపకపోవడంపై ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ప్రశ్నలపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ ప్రసాదరెడ్డి హయాంలో ఏయూలో జరిగిన అవినీతి, అక్రమాలపై 60 రోజుల్లో విజిలెన్స్ విచారణ పూర్తిచేసి, చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.**

సుమారు రూ.20 కోట్ల రూసా నిధులు దుర్వినియోగం చేశారని, ఇస్రో నుంచి వచ్చిన రూ.25 లక్షల వ్యయంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదు అందినట్టు మంత్రి తెలిపారు.

మాజీ వీసీ వ్యవహారాలపై ఇన్‌చార్జి వీసీ నియమించిన కమిటీ కూడా విచారణ జరిపినట్టు తెలిపారు. విజిలెన్స్ నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులైన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టంచేశారు. మంత్రి ప్రకటనపై వర్సిటీలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అడ్డగోలు వ్యవహారాలన్నీ బయటకు వస్తాయని ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

ఆరోపణలు ఎన్నో...

- మాజీ వీసీ ప్రసాదరెడ్డి తన హయాంలో రిటైర్డ్ ప్రొఫెసర్లకు అడ్డగోలుగా పదవులు కట్టబెట్టారు. ఈ జాబితాలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్ ముందువరుసలో ఉంటారు. పదవీ విరమణ తరువాత మూడు సార్లు ఆయనకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు కట్టబెట్టారు. ఆ తరువాత ఓఎస్‌డీగా నియమించుకున్నారు. అనేక విభాగాల్లో ప్రిన్సిపాల్స్, డీన్లుగా, డైరెక్టర్లుగా పదవీ విరమణ చేసిన వారికి అవకాశం కల్పించారు.
- రూసా, పూర్వ విద్యార్థులు అందించిన నిధులు దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. భవన నిర్మాణాల్లో భారీగా నిధులు దుర్వినియోగం అయినట్టు ఫిర్యాదులు ఉన్నాయి.
- రిజిస్ట్రార్‌గా వర్సిటీతో సంబంధం లేని వ్యక్తికి అవకాశం కల్పించారు. ఇది నిబంధనలకు పూర్తి విరుద్ధమన్న ఆరోపణలు ఉన్నాయి.
- నిబంధనలకు విరుద్ధంగా టీడీఆర్ హబ్‌లో ప్రవేశాలు కల్పించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం భారీగా డబ్బులు చేతులు మారినట్టు ప్రచారం ఉంది.
- నార్త్ క్యాంపస్ పరిధిలో చిట్టడవిని తలపించేలా వేలాది వృక్షాలు ఉండేవి. అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయంటూ వాటిని తొలగించి, బయట వ్యక్తులకు కట్టబెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పూర్తి స్థాయిలో విచారణచేయాల్సిన అవసరం ఉంది.
- వర్సిటీలో మొక్కల తొలగించిన ప్రాంతంలో

... మిగతా 6వ పేజీలో

క్లాప్ వాహనాలకు బ్రేక్?

పనితీరుపై జీవీఎంసీ అధికారుల అసంతృప్తి

- ఇళ్ల నుంచి చెత్త సేకరణ మొక్కుబడిగా సాగుతుందనే ఫిర్యాదు
- ఒక ట్రిప్పులో కనీసం 500 కిలోల చెత్త తీసుకువెళ్లాలన్న నిబంధన బేఖాతరు
- 250 కేజీల చెత్తతో యార్డుకు....
- క్లాప్ స్థానంలో క్లస్టర్లు వారీగా పారిశుధ్య నిర్వహణకు టెండర్లు
- ప్రభుత్వం యోచన?



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న క్లాప్ వాహనాల పనితీరుపై రాష్ట్ర ప్రభుత్వం అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్న మొత్తానికి తగ్గట్టుగా క్షేత్ర స్థాయిలో చెత్త సేకరణ జరగడం లేదనే అభిప్రాయం జీవీఎంసీ అధికారుల్లోనూ ఉంది. అందుకే వీధుల్లో చెత్త పేరుకుపోతుందంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అభిప్రాయమే వ్యక్తమవుతుండడంతో క్లాప్ వాహనాలను తొలగించి, గతంలో మాదిరిగా క్లస్టర్ల వారీగా వాహనాలను సమకూర్చుకునేందుకు టెండర్లు పిలవాలని భావిస్తున్నట్టు తెలిసింది.

జీవీఎంసీ పరిధిలో క్లాప్ వాహనాలు	586
ఒక వాహనం రోజుకు యార్డుకి తిరగాల్సిన ట్రిప్పులు	3
ఒక ట్రిప్పులో తీసుకువెళ్లాల్సిన చెత్త	కనీసం 500 కిలోలు
ఒక్కో వాహనానికి జీవీఎంసీ చెల్లించే మొత్తం	రూ.64 వేలు
వాహనాల కాంట్రాక్టర్‌కు జీవీఎంసీ ప్రతినెలా చెల్లిస్తున్న మొత్తం	రూ.3.75 కోట్లు

స్థానిక సంస్థల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకంటూ వైసీపీ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)కు శ్రీకారం చుట్టింది. ప్రతి స్థానిక సంస్థలో వెయ్యి ఇళ్లకు ఒక వాహనం చొప్పున టాటా ఏస్ వాహనాలను కేటాయించింది. డ్రైవర్‌తో కూడిన ఒక్కో వాహనానికి నెలకు రూ.64 వేల చొప్పున ఆయా స్థానిక సంస్థలే చెల్లించేలా రాష్ట్రమంతటికీ గ్లోబల్ టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌ను ఖరారు చేసింది. అందులో భాగంగా జీవీఎంసీకి 586 వాహనాలను కేటాయించింది. ఒక్కో వాహనానికి రూ.64 వేలు చొప్పున నెలకు రూ.3.75 కోట్లు సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించాలని జీవీఎంసీని ఆదేశించింది. క్లాప్ వాహనం తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి రోజూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సమీపంలో చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలించాలని, ఇలా రోజుకు మూడు ట్రిప్పులు వేయాలని నిబంధన విధించింది. ప్రతి వాహనం సక్రమంగా చెత్తసేకరించి, విభజించి, ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలించేలా వార్డు సచివాలయ సిబ్బంది చూడాలని ఆదేశించింది. కానీ క్లాప్ వాహనాలను ప్రారంభించినప్పటి నుంచి సచివాలయ సిబ్బంది ఆ బాధ్యతలను చేపట్టేందుకు అంగీకరించలేదు. దాంతో ఆ వాహనాలపై ప్రత్యక్ష పర్యవేక్షణ లోపించినట్టయింది. ప్రశ్నించేవారు లేకపోవడంతో తమకు నచ్చినట్టు నడపడం ప్రారంభించారు. ఒక వాహనం వెయ్యి ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తే కనిష్ఠంగా వెయ్యి కిలోలు వస్తుందని అధికారులు లెక్కించారు. అది కాకుండా మార్కెట్లు, దుకాణాలు, వాణిజ్య సముదాయాల నుంచి రోడ్లపై పోగయ్యే చెత్త మరో 600 కిలోల వరకూ ఉంటుందని అంచనా వేశారు. దీని ప్రకారం ప్రతి వాహనం రోజుకు గరిష్ఠంగా 1,500 కిలోల చెత్తను ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తీసుకువెళ్లాలి. కానీ చాలా వాహనాలు ఒక్కో ట్రిప్పులో 250 కిలోలకు మించి చెత్తను తీసుకురావడం లేదని అక్కడి సిబ్బంది తరచూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. కొంతమంది డ్రైవర్లు కూడా సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో ఏ వాహనం ఎప్పుడు చెత్తసేకరణకు వెళ్లదనే సమాచారం అధికారులకు కూడా ఉండడం లేదు. ప్రతి రోజూ ఇంటింటికీ చెత్తసేకరణకు వాహనం వెళ్లకపోవడం, కొన్ని వాహనాలు మొక్కుబడిగా ప్రధాన వీధుల్లోని ఇళ్ల నుంచే చెత్తసేకరించి, రెండు,మూడు రోజులకు ఒకసారి సందుల్లోని ఇళ్లకు వెళ్లి చెత్తసేకరించడం జరుగుతోంది. దీనివల్ల ఆయా ప్రాంతాల్లోని నివాసితులు తమ ఇళ్లలోని చెత్తను రోడ్డుపైకి తెచ్చి పడేస్తున్నారు. దీనివల్ల రోడ్లు తెల్లవారేసరికి చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయి. ఇది నగర పరిశుభ్రతపై ప్రభావం చూపుతుండడంతో అధికారులు తరచూ క్లాప్ కాంట్రాక్టర్‌ను పిలిచి సక్రమంగా వాహనాలను నడపాలని ఆదేశించడం, అందుకు ఆయన తాము వాహనాలను

... మిగతా 6వ పేజీలో

గ్రేటర్ ఎస్కేప్!

గ్రంథాలయాలకు సెస్ చెల్లించకుండా తప్పించుకుంటున్న జీవీఎంసీ

బకాయిలు రూ.100 కోట్లపైనే...

- పూర్తి వివరాలు ఇవ్వాల్సిందిగా జిల్లా గ్రంథాలయ సంస్థ మొర
- ఉమ్మడి జిల్లాలో పంచాయతీల నుంచి రావలసింది రూ.20 కోట్లు



విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వ సంస్థలకు బకాయిల చెల్లింపులో గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) తాత్సారం చేస్తోంది. ప్రజల నుంచి ఆస్తి/నీటి పన్నులు ముక్కుపిండి వసూలుచేసే జీవీఎంసీ...ప్రభుత్వంలో ఇతర శాఖలకు సెస్ చెల్లింపులో మాత్రం మొండిగా వ్యవహరిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో మూడు వారాల్లో ముగియనున్నందున సెస్ బకాయిలు చెల్లించాలని కోరుతూ జీవీఎంసీకి జిల్లా గ్రంథాలయ సంస్థ లేఖ రాసింది.**

నగరంలో ఇళ్లు, ఇతర ఆస్తులకు సంబంధించి యజమానులు ఏటా ఆస్తి పన్ను చెల్లిస్తారు. అందులో గ్రంథాలయ సెస్ ఎనిమిది శాతం, విద్య సెస్ ఒక శాతం...ఉంటాయి. సెస్ వసూళ్లకు గ్రంథాలయ సంస్థకు సొంత యంత్రాంగం ఉండదు కాబట్టి స్థానిక సంస్థలే వసూలు చేసి, ఆ మొత్తాన్ని వాటికి జమ చేయాలి. అయితే గ్రామ పంచాయతీలుగానీ జీవీఎంసీగానీ జిల్లా గ్రంథాలయ సంస్థకు సెస్ సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో బకాయిలు పెరిగిపోయాయి. ఇప్పటివరకూ ఉన్న సమాచారం ప్రకారం జీవీఎంసీ నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.100 కోట్లపైగా రావల్సి ఉంది. దీనిపై గ్రంథాలయ సంస్థ అధికారులు అనేక పర్యాయాలు జీవీఎంసీ అధికారులను స్వయంగా కలవడం లేదా లేఖలు రాయడం చేస్తూనే ఉన్నారు. ఇటీవల నగరానికి వచ్చిన రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్‌ను కలిసి జీవీఎంసీ బకాయిలపై వినతిపత్రం అందజేశారు. వైసీపీ హయాంలో పలువురి పోరాట ఫలితంగా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు నెలకు రూ.50 లక్షలు వంతున సెస్ బకాయిలు చెల్లించారు. తరువాత ఎన్నికలు రావడంతో జీవీఎంసీ బకాయిల చెల్లింపు నిలిపివేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో గ్రంథాలయ సెస్ వివరాలు తెలియజేయడంతోపాటు కొంతమేర బకాయిలు చెల్లించాలని కోరుతూ గ్రంథాలయ సంస్థ లేఖ రాసింది. బకాయిలో 20 శాతం వరకు చెల్లిస్తే జిల్లా గ్రంథాలయ సంస్థకు నూతన భవనం నిర్మించవచ్చునని గ్రంథాలయ ఉద్యమకారులు అంటున్నారు.

పంచాయతీ బకాయిలు రూ.20 కోట్లు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 969 గ్రామ పంచాయతీలు, ఎలమంచిలి, నర్సీపట్నం మునిసిపాలిటీలు కూడా గ్రంథాలయ సెస్ చెల్లించాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నర్సీపట్నం రూ.20 లక్షలు, ఎలమంచిలి మునిసిపాలిటీ రూ.10.8 లక్షలు సెస్ చెల్లించాయి. గ్రామ పంచాయతీల నుంచి రూ. ఆరు కోట్ల మేర వసూలైంది. ప్రస్తుత ఏడాది కరెంట్ డిమాండ్, బకాయిలు కలిపి పంచాయతీల నుంచి రూ.20 కోట్ల వరకు వసూలు కావాలని అధికారులు అంచనా వేస్తున్నారు. సెస్ బకాయిల కోసం గ్రంథాలయ సిబ్బంది తమ పరిధిలో పంచాయతీ కార్యదర్శులను కలుస్తున్నారు. ప్రజల నుంచి వసూలుచేసే సెస్‌ను గ్రంథాలయాలను కేటాయిస్తే...మరింత అభివృద్ధి చేయడానికి దోహదపడతాయని ఉద్యమకారులు కోరుతున్నారు.

పెరుగుతున్న బైక్ ప్రమాదాలు



- గడచిన వారం రోజుల్లో ఆరుగురి మృతి
- అపరిమిత వేగంతో వెళుతూ అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్న యువత

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

- **ఈనెల ఐదో తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత తాటిచెట్లపాలెం-కంచరపాలెం రోడ్డులో బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.**
- ఈనెల ఆరో తేదీ తెల్లవారుజామున హనుమంతవాకజంక్షన్‌లో లారీని వెనుక నుంచి బైక్ ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు.
- గురువారం కూర్మన్నపాలెం జంక్షన్‌లో బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఇద్దరు చనిపోయారు.

నగరంలో గత వారం, పది రోజుల్లో ఐదుచోట్ల ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురికాగా...

... మిగతా 6వ పేజీలో

గత మూడేళ్లలో ద్విచక్రవాహనాల ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణాలు
2023	350	95
2024	295	130
2025(ఫిబ్రవరి వరకు)	54	21

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బైక్‌ను ఢీకొన్న టిప్పర్





నక్కా కృష్ణ, ద్రోణాద్రి రాంబాబు (ఫైల్ ఫొటోలు)

కూర్మన్నపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో జంక్షన్ వద్ద గురువారం ఉదయం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దువ్వాడ సమీపాన కొత్తూరులో నక్కా కృష్ణ (45), ద్రోణాద్రి రాంబాబులు కుటుంబాలతో నివాసముంటున్నారు. వీరు ఇరువురూ స్టీలుప్లాంటులో కూలీ పనులకు వెళుతుంటారు. బుధవారం రాత్రి సీ షిఫ్ట్ డ్యూటీకి వెళ్లి గురువారం ఉదయం ఒకే ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా కూర్మన్నపాలెం వద్ద అనకాపల్లి నుంచి గాజువాక వైపు అతి వేగంగా వెళుతున్న టిప్పర్ వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్నవారు...ఆ సమయంలో పక్కనుంచి వెళుతున్న బస్సు కిందపడడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ప్రమాదంలో రోడ్డుపై వెళుతున్న పి.శ్రీను అనే అతను తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలిసిన వెంటనే దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె.వెంకట్రావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయాలపాలైన శ్రీనును ఆసుపత్రికి తరలించారు. కృష్ణ, రాంబాబు కుటుంబాలు బతుకుతెరువు కోసం పదేళ్ల క్రితం ఏలూరు నుంచి నగరానికి వచ్చాయి. తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతుల కుటుంబీకులు మృతదేహాలతో రహదారిపై ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ ఆందోళనకు దిగారు. ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ టి.త్రినాథ్, సీఐ మల్లేశ్వరరావు, ఎస్సైలు శ్రీనివాస్,

... మిగతా 6వ పేజీలో

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన పీడీఎస్ బియ్యం వ్యాను

పెందుర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా అవుతున్న 900 (23 బస్తాలు) కిలోల రేషన్ బియ్యాన్ని మండలంలోని కాపుజగ్గరాజుపేట వద్ద సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి మల్కాపురం దుర్గానగర్‌కు చెందిన పూసర్ల అచ్చిబాబు(49)ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని ఎంఎల్‌సీ పాయింట్‌కు తరలించనున్నామన్నారు. తెలుపు రంగు కార్డుదారులకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని దళారులు కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తుంటారన్నారు. మిల్లులో పాలిష్ పట్టి సన్న బియ్యంగా మళ్లీ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని సీఐ తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర)	6.09
సహరి (శని)	4.48

70 ఏళ్లు దాటితే ఆయుష్మాన్ వయో వందన కార్డులు

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 70 ఏళ్లు దాటిన వారికి ఆయుష్మాన్ వయో వందన కార్డులు పంపిణీ చేయనున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఈ లబ్ధి పొందవచ్చునని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్), మాజీ సైనికుల సహకార ఆరోగ్య పథకం (ఈసీహెచ్‌ఎస్), ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) వంటి వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందుతున్న సీనియర్ సిటిజన్లు వారి ప్రస్తుత పథకం, లేకపోతే ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజనను ఎంచుకోవచ్చునని వివరించారు. ప్రైవేటు ఆరోగ్య బీమా

... మిగతా 6వ పేజీలో

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కలెక్టర్ సమీక్ష

- కార్యక్రమాలను జోనల్ కమిషనర్లు పర్యవేక్షించాల్సిందిగా ఆదేశం
- ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర
- పీ4ను 18లోగా పూర్తి చేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, పీ4, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వే వంటి కార్యక్రమాలను జోనల్, వార్డు స్థాయి ప్రత్యేక అధికారులతోపాటు జోనల్ కమిషనర్లు కూడా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, వార్డు స్థాయి స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సర్వే నేపథ్యంలో అన్ని రంగాల్లోనూ ప్రమాణాలకు అనుగుణంగా పరిస్థితి ఉండేలా చూసుకోవాలన్నారు. సిటిజన్ ఫీడ్‌బ్యాక్, ప్రజలకు అవగాహన కల్పించే

... మిగతా 6వ పేజీలో

రో.క.నెం.234/2024/ఏ1, తేది. 13-3-2025

ఐ.టి.డి.ఎ. పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా

షార్ట్ టెండర్ నోటీస్

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా, ఐ.టి.డి.ఎ., పాడేరు ప్రాంతమునకు చెందిన 100 మంది గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు YTC, వేపగుంట, విశాఖపట్నం నందు సివిల్ సర్వీసు UPSC/APPSC పరీక్షలకు సుమారు 11 నెలల కాలపరిమితితో ఉచిత కోచింగ్ నిర్వహించబడును. కోచింగ్ ఇవ్వుటకు అనుభవజ్ఞులైన కోచింగ్ కేంద్రాలు అవసరమైయున్నవి. కావున ఆసక్తి గల మరియు అనుభవం కలిగిన కోచింగ్ కేంద్రాల నుండి సీల్డ్ టెండర్స్ కోరబడుచున్నవి. కోచింగ్ కేంద్రాలు ఐ.టి.డి.ఎ. కార్యాలయము నుండి ఆఫీస్ పనిదినములలో టెండర్ డాక్యుమెంట్ కాస్ట్‌గా రూ.5000/- (non-refundable) డి.డి. రూపేణా చెల్లించి టెండర్ డాక్యుమెంట్ తేది 17-03-2025 నుండి 21-03-2025 మధ్యాహ్నం 1PM లోపున తీసుకొని పూర్తి చేసిన టెండర్స్ సీల్డ్ కవర్లలో వుంచి ఐ.టి.డి.ఎ. కార్యాలయము నందు ఉంచిన టెండర్ బాక్స్ నందు తేది:21-03-2025 మధ్యాహ్నం 3 PM లోపున వేయవలసినదిగా కోరడమైనది. టెండర్ బాక్స్ అదే రోజు సాయంత్రం 4 PM తరువాత ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ. పాడేరు వారిచే కాని లేక వారిచే నియమించబడిన కమిటీ వారిచే కాని తెరువబడును.

టెండర్ డాక్యుమెంట్ లభించు స్థలము : ఐ.టి.డి.ఎ. పాడేరు కార్యాలయము.
తేది:17-03-2025 నుండి 21-03-2025 మధ్యాహ్నం 1PM లోపున

సీల్డ్ టెండర్‌లు స్వీకరించడానికి చివరి తేది : 21-03-2025 మధ్యాహ్నం 3 PM లోపున

ముఖ్య నిబంధనలు :

1. టెండర్స్ ఐ.టి.డి.ఎ. పాడేరు నుండి పొందిన టెండర్ డాక్యుమెంట్ నందు మాత్రమే వేయవలెను. టెండర్ డాక్యుమెంట్ నందు కాక వేరే డాక్యుమెంట్‌లో వేసిన టెండర్లు పరిశీలించబడవు. ప్రతి టెండర్‌లో టెక్నికల్ బిడ్ మరియు ఫైనాన్షియల్ బిడ్ వేరు వేరు కవర్లలో ఉండవలెను. టెండర్ కమిటీ టెక్నికల్ బిడ్ మొదట పరిశీలించబడును. టెక్నికల్ బిడ్‌లో అర్హత పొందిన టెండర్స్ మాత్రమే వారియొక్క ఫైనాన్షియల్ బిడ్ ఓపెన్ చేయబడును.
2. ప్రతి టెండర్ డాక్యుమెంట్‌తో పాటు రూ.1,50,000/- EMD ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ. పాడేరు వారి పేరుమీద తీసిన డి.డి. రూపములో జతపరచ వలెను. EMD చెల్లించని టెండర్స్ తిరస్కరించబడును.
3. కోచింగ్ కేంద్రాలు గత పది సంవత్సరాలలో సివిల్ సర్వీసెస్ UPSC/APPSC పరీక్షలలో కోచింగ్ ఇచ్చిన అనుభవం కలిగి ఉండాలి మరియు మంచి ఫలితాలు సాధించి ఉండాలి. ముఖ్యముగా గత పది సంవత్సరాలలో కనీసం రెండు-మూడు సంవత్సరాలలో సివిల్ సర్వీసెస్ UPSC, APPSC, పరీక్షలలో షెడ్యూల్డ్ తెగ (ST) విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన అనుభవం మరియు అత్యుత్తమ ఫలితాలను సాధించిన కోచింగ్ కేంద్రాలకు అగ్ర ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. టెండర్ డాక్యుమెంట్‌తో పాటు సంవత్సరము వారి షెడ్యూల్డ్ తెగ (ST) విద్యార్థుల విషయములో సాధించిన ప్రగతి అభ్యర్థి వారి పూర్తి వివరములు సర్టిఫైడ్ కాపీ జతపరచాలి.
4. కోచింగ్ కేంద్రాలు జీఎస్టీ చట్టం క్రింద నమోదు చేసికొని వుండాలి మరియు పాన్ కార్డు కలిగి వుండాలి. సంబంధిత కాపీలు జతపరచాలి.
5. ఏదైనా టెండర్ లేక అన్ని టెండర్స్ కేన్సిల్ చేసే అధికారము ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ. పాడేరు వారికి వున్నది. టెండర్ విషయములో ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ. పాడేరు వారిదే తుది నిర్ణయము.
6. ఇతర నిబంధనలు టెండర్ డాక్యుమెంట్ నందు పొందుపరచబడినవి.

ప్రాజెక్ట్ ఆఫీసర్,
ఐ.టి.డి.ఎ., పాడేరు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ

తగరపువలస, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చిట్టివలస బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు గ్రామానికి చెందిన కట్టమూరి ఏడుకొండలు, సరస్వతి దంపతులు పరీక్షల సామగ్రి కిట్లను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రోజామణి, పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

కొమ్మాది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సురేశ్ అన్నారు. గురువారం కళాశాలలో రోటరీబ్లడ్ బ్యాంక్, వందేభారత్ బ్లడ్ బ్యాంక్‌లు సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలను ఫైనాన్స్ డైరెక్టర్ మాధవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.సునీల్ అభినందించారు.

ప్రజా కళాకారుడికి నివాళి

కొమ్మాది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గాయకుడు, రచయిత, ప్రజా కళాకారుడు పందిరిరాము మృతి సీపీఎంకు తీరని లోటని పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ కార్పొరేటర్ బి.గంగారావులు అన్నారు. అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి రాము మృతి చెందారు. ఈ విషయం తెలుసుకుని సీపీఎం శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు గురువారం ఆయన ఇంటికి చేరుకుని నివాళులర్పించారు.

స్వర్ణ నారసింహుడిగా భక్తులకు అప్పన్న దర్శనం



సింహాచలం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనారసింహుడు భక్తులకు గురువారం స్వర్ణ నారసింహుడిగా దర్శనమిచ్చాడు. కొన్నేళ్ల క్రితం రాజమహేంద్రవరానికి చెందిన భక్తుడు స్వర్ణ నారసింహ కవచాన్ని తయారు చేయించి విరాళంగా సమర్పించారు. కొంత కాలంగా పలువురు భక్తుల దర్శనార్థం ప్రతి బుధవారం రాత్రి ఆరాధన సమయంలో స్వర్ణ కవచాన్ని స్వామికి అలంకరించి మరుసటి రోజు అనగా గురువారం రాత్రి ఆరాధన సమయం వరకు స్వర్ణ కవచంతోనే సింహాద్రి నాథుని దర్శనం భక్తులకు కలిపిస్తున్నారు. దీంతో గురువారం స్వామి భక్తులకు స్వర్ణ నారసింహుడిగా దర్శనం ఇస్తున్నారు.

వైభవంగా అనంతపద్మనాభుడి రథోత్సవం

అడుగడుగునా భక్తుల నీరాజనం



స్వామికి పూజలు నిర్వహిస్తున్న సీఐ



భక్తుల కోలాహలం మధ్య రథోత్సవం

పద్మనాభం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభుని రథయాత్ర గురువారం రాత్రి అత్యంత వైభవంగా సాగింది. అంతకు ముందు నిత్యహోమం, మహాశాంతి హోమం, సర్వ దైవశ్యహోమం, నవకుంభారాధన, స్వామి వారి గ్రామ బలిహరణ నిర్వహించారు. అనంతరం కృష్ణాపురం, పద్మనాభం, అర్చకునిపాలెం, ఇసకలపాలేనికి చెందిన రైతులు సంప్రదాయం మేరకు రథానికి పూజలు చేసి తాళ్లు కట్టారు. సాయంత్రం నిత్య హోమం, గ్రామ బలిహరణ, రథాంగ హోమం, మహిళలు లక్ష్మీ సన్నిధిలో దీపారాధన చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన అనంతుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిపై ఊరేగింపుగా తీసుకువచ్చి రథాన్ని అధిరోహింపజేశారు. అనంతరం రథం ఎదురుగా కుంభం వేశారు. ఆలయ దివిటీ, మేళంతో వెళ్లి పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్‌ను ఆహ్వానించారు. సీఐ దంపతులు తొలిపూజ చేసిన అనంతరం భక్తుల హరినామస్మరణతో రథాన్ని సుంకర, కనకల, తాలాడ, సురాల, మొకర, అవనాపు తదితర కుటుంబాలకు చెందిన వారు లాగారు. గ్రామ సందర్శనలో భాగంగా రథంపై విహరిస్తున్న స్వామికి భక్తులు విశేష పూజలు, అర్చనలు చేశారు. ఉత్సవంలో భాగంగా అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం అనంతుని పరస జరిగింది. స్వామి, అమ్మవార్లు ఆలయానికి తిరిగి రావడంతో రథోత్సవం ముగిసింది. కార్యక్రమంలో ఈవో నానాజీబాబు, అర్చకులు వి.సీతారామాంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా సిరి సంపెంగల పూజలు



పూజలు అందుకుంటున్న స్వామి వారు

సింహాచలం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సింహాద్రినాథుడికి వైభవంగా సిరి సంపెంగల (స్వర్ణపుష్పాల)తో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా ప్రతి ఆది, గురువారాల్లో ఈ సేవను నిర్వహిస్తారు.ఇందులో భాగంగా గురువారంవేకువజామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యధావిధిగా పూర్తిచేశారు. ఆలయ పద్మనిధి(బాండాగారం) నుండి సిరి సంపెంగలను తీసి భక్తులచే స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేసి ప్రత్యక్షంగా పాల్గొన్న ఉభయదాతల గోత్రనామాలతో సంకల్పించారు. శాస్త్ర విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి(108) పఠిస్తూ అన్ని నామాలకు సిరి సంపెంగలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చి, భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కార్మిక పింఛనుదారులకు ఉచిత వైద్య సదుపాయాలు

పింఛనుదారుల సమావేశం డిమాండ్



సమావేశానికి హాజరైన పింఛనుదారులు

తగరపువలస, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖలో పనిచేసి పదవీ విరమణ చేసిన పింఛనుదారులు, ఇతర పింఛనుదారులకు కల్పిస్తున్న మాదిరిగానే ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాలని చిట్టివలస కార్మిక పింఛనుదారుల సమావేశం తీర్మానించింది. గురువారం చిట్టివలసలో జరిగిన ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు కానూరి రాంబాబు అధ్యక్షత వహించారు. కర్మాగారాలలో పని చేసి పదవీ విరమణ చేసిన వారికి పదవీ విరమణ అనంతరం ఎలాంటి ఆధారం లేకుండా పోతోందని, వీరికి కరువు భత్యంతో కలిపి రూ.9 వేలు కనీస పింఛనుగా చెల్లించాలని కోరారు. సీనియర్ పింఛనుదారులకు రైలు ప్రయాణంలో రాయితీలను కల్పించాలని కోరారు. ఈనెల 18న తమ సమస్యలను తెలియజేయడానికి విశాఖపట్నంలోని పీఎఫ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించాలని సమస్యలను తెలియజేయాలని తీర్మానించారు. దేశ వ్యాప్తంగా 196 రకాల పరిశ్రమల్లో 95 రకాల కార్మికులు పని చేస్తున్నారని, వీరిందరికి పింఛను సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ మాట్లాడుతూ చిట్టివలసలో ఎంతోమంది పింఛనుదారులు జూట్ మిల్లులో పని చేసి ఎటువంటి పింఛను లేకుండా దుర్భరంగా జీవనం సాగిస్తున్నారని, వీరి విషయంలో న్యాయం చేయాలని కోరారు. ప్రతి అయిదేళ్లకు ఒకసారి పొందుతున్న పింఛను మొత్తాన్ని రివిజన్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు చిల్ల అప్పారావు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, సీనియర్ నాయకులు సింగుడు అప్పారావు తదితరులు మాట్లాడారు.

అక్రమంగా తాగునీటిని తరలిస్తున్న ట్యాంకర్ పట్టివేత

భీమునిపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులో అనధికారికంగా తాగునీటిని రవాణా చేస్తున్న వాటర్ ట్యాంకర్‌ను గురువారం మధ్యాహ్నం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తహశీల్దార్ పైలా రామారావు ఆదేశాల మేరకు కె.నగరపాలెం వీఆర్వో గోపీకృష్ణ చేపల తిమ్మాపురం జంక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తిమ్మాపురం, మారికవలస వందడుగుల రోడ్డులో అక్రమంగా తాగునీటిని నగరానికి తరలిస్తున్న ట్యాంకర్‌ను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అనధికారికంగా తాగునీటిని సరఫరా చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలా చేయడం ద్వారా వేసవిలో నీటి ఎద్దడిని నివారించవచ్చన్నారు.

'అవంతి'లో ఆకట్టుకున్న కృత్రిమ మేధ ప్రాజెక్టులు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) ఇక్కడి అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన కృత్రిమ మేధ ఇన్నోవేటివ్ ఎక్స్2కె25 సదస్సులో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సదస్సులో వివిధ కళాశాలలకు చెందిన 850 మంది విద్యార్థులు పాల్గొని 120 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సదస్సును ప్రారంభించిన సంస్థ చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచమంతా కృత్రిమ మేధ చుట్టూ తిరుగుతున్నందున విద్యార్థులందరూ దీనిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాస్పెక్టా టెక్నాలజీస్ సీఈవో సుధాకర్, డి జిఫెక్ సర్వీసెస్ సంస్థ డైరెక్టర్ పి.అమల్‌రాజ్, ఐటీ సొల్యూషన్స్ ఉపాధ్యక్షుడు శ్రీచరణ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపాలెం స్కూల్‌ను సందర్శించిన గంటా రవితేజ

కొమ్మాది, మార్చి13 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ గురువారం చంద్రంపాలెం జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులు బహిరంగ ఘర్షణకు దిగడం, పాఠశాలలో గుర్తు తెలియని ఆకతాయిలు నిప్పురవ్వలు వేయడం వంటి ఘటనల నేపథ్యంలో ఆయన పాఠశాలకు విచ్చేశారు. చంద్రంపాలెం పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉందని, అందువల్ల ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాల కమిటీ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.విద్యార్థుల మధ్య గొడవలు జరగకుండా చర్యలు చేపట్టాలని పీఎంపాలెం పోలీసులను కోరారు. పాఠశాలలోని సమస్యలను హెచ్ఎం గొట్టేటి రవి, స్కూల్ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

హెచ్ఎం, ఉపాధ్యాయులకు సత్కారం

భీమునిపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పొన్నగంటి రమణ, ఉపాధ్యాయులు, సిబ్బందిని శతాబ్ది ఉత్సవ పూర్వ విద్యార్థుల కమిటీ ఘనంగా సత్కరించింది. గత నెలలో ఈ ఉత్సవాలను రెండు రోజుల పాటు నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే అప్పట్లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉపాధ్యాయులు పాల్గొనలేదు. దీంతో శుక్రవారం పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు గాడు అప్పలనాయుడు, ఎం.లక్ష్మణరావు, పి.శ్రీనివాసరావు, ఎం.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలకు ప్రజలంతా సహకరించాలి: జడ్సీ

కొమ్మాది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విజన్-2047 కార్యక్రమంలో భాగంగా పది సూత్రాల అమలు కోసం జోన్-2 పరిధిలో సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేలకు ప్రజలందరూ సహకరించవలసిందిగా జడ్సీ కనకమహాలక్ష్మి కోరారు. ఇంటింటికీ సచివాలయ సిబ్బంది వచ్చి పీ4 సర్వే, వర్క్ ఫ్రమ్ హోం, తదితర సర్వేలు నిర్వహించి ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. వీటి నివేదికక ఆధారంగా పేదరిక నిర్మూలన, ఉద్యోగ కల్పన, తదితర కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

అష్టలక్ష్మికి సామూహిక కుంకుమార్చన

భీమునిపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటగిరిపై గల శ్రీపద్మావతి, గోదా సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గురువారం వేకువజామున సుప్రభాత సేవ, నిత్య విశేష హోమాలు చేశాక అష్టలక్ష్మీదేవికి సామూహిక కుంకుమార్చన చేపట్టారు. అలాగే సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం పండిత సదస్యం, తులాభారం జరిగింది. కార్యక్రమంలో ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, నాయకులు ఆర్.పెదబాబు, జి.సన్యాసిరావు,సన్యాసినాయుడు, ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.









త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

జీవీఎంసీ, వీఎంఆర్డీఏ అధికారులకు జేసీ మయూర్ అశోక్ ఆదేశం



రుషికొండ బీచ్‌లో అభివృద్ధిపనులను పరిశీలిస్తున్న జాయింట్‌కలెక్టర్ మయూర్‌అశోక్

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌లో జీవీఎంసీ, వీఎంఆర్డీఏ చేపట్టిన అభివృద్ధిపనులు త్వరిత గతిన పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో జీవీఎంసీ, వీఎంఆర్డీఏ చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం రాత్రి జేసీ మయూర్‌అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రుషికొండ బీచ్‌లో దివ్యాంగులకు ఉపయోగపడేలా మెరైన్ వాచ్‌టవర్ వద్ద నిర్మిస్తున్న మెట్లమార్గం, ఫుట్‌పాత్ పనులు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, పార్కు ఆధునీకరణ పనులను పరిశీలించారు. త్వరలో బ్లూఫ్లాగ్ బృందం రుషికొండ బీచ్‌ను సందర్శించనున్న నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా అభివృద్ధి పనులు త్వరితంగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా టూరిజం అధికారి సుధాసాగర్, రీజనల్ డైరెక్టర్ జగదీశ్, వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఫీజులు పెండింగ్ పేరుతో హాల్‌టిక్కెట్లు ఇవ్వకుండా వేధిస్తే చర్యలు తప్పవు

ఆరిలోవ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఫీజులు పెండింగ్ పేరుతో కొన్ని ప్రైవేటు పాఠశాలలు హాల్‌టిక్కెట్లు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఇలాంటి చర్యలకు పాల్పడితే ఆయా విద్యాసంస్థలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఫీజులు పేరిట విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి చేయడం దుర్మార్గమన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఫీజుల బకాయి పేరుతో హాల్‌టిక్కెట్లు ఇవ్వకుంటే చర్యలు తప్పవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా కూడా పదో తరగతి హాల్‌టిక్కెట్లను జారీ చేస్తోందనే విషయం విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్‌టిక్కెట్లు పొందిన నిర్భయంగా పరీక్ష రాయవచ్చన్నారు. టెన్త్ హాల్‌టికెట్ల జారీలో జిల్లా విద్యాశాఖాధికారులు... విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని సీతారాం కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

జగదీష్, కార్పొరేటర్లు బొండా జగన్, ఎం.ముత్యాలునాయుడు, టీడీపీ నాయకుడు నల్లూరు సూర్యనారాయణలు టిప్పర్ యజమానితో మాట్లాడారు. ఒక్కొక్కరికి రూ.4 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించడంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు.

నక్కా కృష్ణకు భార్య సింహాచలం, ఇద్దరు కుమార్తెలు,

ద్రోణాద్రి రాంబాబుకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

70 ఏళ్లు దాటితే ఆయుష్మాన్ వయో వందన కార్డులు

... 5వ పేజీ తరువాయి

కవరేజీ పరిధిలోకి వచ్చే వ్యక్తులు, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం సభ్యులు ఈ పథకం కింద ప్రయోజనం పొందేందుకు అర్హులన్నారు. జిల్లాలో అర్హత కలిగిన సీనియర్ సిటిజన్లు ఆయుష్మాన్ వయో వందన కార్డులు పొందేందుకు సమీపంలోని ఎంప్యానెల్డ్ ఆస్పత్రుల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్వీయ రిజిస్ట్రేషన్‌కు ఆయుష్మాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 14555 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని లేదా ఫోన్ 1800110770కు మిస్డ్‌కాల్ ఇవ్వాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కలెక్టర్ సమీక్ష

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమాలను వార్డు స్థాయి ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పీ4 సర్వేను 18వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ పి.శివప్రసాదరాజు, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్‌వీ నరేష్, సీసీపీ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ వాహనాలకు బ్రేక్?

... 5వ పేజీ తరువాయి

బాగానే నడుపుతున్నానని, బిల్లులు మాత్రం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేయడం షరామామూలుగా మారిపోయింది. ఈ విషయాన్ని అధికారులు కూడా రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లడం, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఫిర్యాదులే వస్తుండడంతో క్లాప్ వ్యవస్థపై సమీక్షించాలని నిర్ణయించారు. క్లాప్ వాహనాలకు రూ.64 వేలు అద్దె చెల్లించడం కంటే, ఏ నగరానికి ఆ నగరం గతంలో మాదిరిగా చెత్త సేకరణ వాహనాలకు సంబంధించి టెండర్లు పిలుచుకుంటే ఎలా ఉంటుందనే దానిపై చర్చిస్తున్నట్టు సమాచారం. నగరాన్ని కొన్ని క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టర్‌కు అవసరమైన వాహనాలను సమకూర్చేలా టెండర్లు ఆహ్వానిస్తే చెత్త సేకరణ మెరుగుపడుతుందని అధికారులు అభిప్రాయపడినట్టు తెలిసింది. ఇటీవల నగరానికి వచ్చిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభి వద్ద క్లాప్ వాహనాల పనితీరు గురించి అధికారులు ప్రస్తావించగా, క్లాప్ వ్యవస్థను రద్దు చేసే యోచనలో ఉన్నట్టు పరోక్షంగా సంకేతాలిచ్చారు.

ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై విచారణ

... 5వ పేజీ తరువాయి

మైదానాన్ని తయారుచేసేందుకు కొందరు బయటి వ్యక్తులు నిధులు ఇచ్చారు. ఎంత ఇచ్చారు?, ఎంత ఖర్చు చేశారన్నది ఎవరికీ తెలియదు. ఈ నిధులు వినియోగం లెక్క తేల్చాల్సి ఉంది.

- వాహనాలకు డీజిల్ బిల్లుల్లోనూ అడ్డగోలుగా మెక్కేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా పాడైన వాహనాల విక్రయించడం (స్క్రాప్)లోనూ పెద్దఎత్తున అవకతవకాలు జరిగాయంటారు.
- వీసీ ఛాంబర్‌ను ప్రసాదరెడ్డి పూర్తిగా వైసీపీ కార్యాలయంగా మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి సీఎం జగన్, దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ విజయలక్ష్మి, అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఛాంబర్‌లోనే జరిపారు.
- అనేక కోర్సులను పూర్తిగా ఎత్తేశారు. ఫీజులను ఇష్టానుసారంగా పెంచేశారు. తనకు నచ్చని ఎందరో గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించారు.
- రాష్ట్రంలో మరే వర్సిటీలో లేనివిధంగా ఎయిడెడ్ ఫ్యాకల్టీని వర్సిటీలోకి తీసుకువచ్చారు. ఇందుకు భారీగానే వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

పెరుగుతున్న బైక్ ప్రమాదాలు

... 5వ పేజీ తరువాయి

ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాల సంఖ్య రానురాను పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. 2023లో ద్విచక్ర వాహన ప్రమాదాలు 350 జరిగితే అందులో 95 మంది వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. 2024లో 295 ద్విచక్ర వాహనాలు రోడ్డు ప్రమాదానికి గురైతే 130 మంది ప్రాణాలు కోల్పోయారు. 2025లో జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే 54 బైక్‌లు ప్రమాదాలకు గురైతే...దాదాపు 21 మంది మృతిచెందడం విశేషం. ఏటేటా ద్విచక్ర వాహన ప్రమాదాలు, వాటితోపాటు మరణాల సంఖ్య కూడా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొందరు అపరిమిత వేగంతో వాహనాలు నడుపుతూ హఠాత్తుగా ఏదైనా అడ్డువస్తే అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నెల ఐదో తేదీ రాత్రి రైల్వేన్యూకాలనీ-కంచరపాలెం రోడ్డులో బైక్ రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఆరున తెల్లవారుజామున హనుమంతవాక జంక్షన్‌లో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. అదేరోజు హెచ్‌పీసీఎల్ గేటు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. గురువారం ఉదయం కూర్మన్నపాలెం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడే ప్రాణాలు కోల్పోయారు.

పోలీసుల అవగాహన కల్పిస్తున్నా బేఖాతరు

వాహనాన్ని అపరిమిత వేగంతో నడపడం వల్ల ఎదురయ్యే అనర్థాలు, ప్రమాదం జరిగిన తర్వాత పరిస్థితులపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మైనర్ డ్రైవింగ్, అధిక శబ్దం ఇచ్చే సైలెన్సర్లతో కూడిన వాహనాలను నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

అయినప్పటికీ పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు.

హోలీ.. రంగేళీ!

హోలీ రంగుల పండుగ. సీజన్‌మారే సంధికాలంలో శరీరాన్ని చుట్టుముట్టే వ్యాధుల నుంచి రక్షణ కోసం పలు రకాల సంప్రదాయ రంగుల్ని ఒంటిపై చల్లుకుని వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవడం ఈ పండుగలోని ప్రధాన ఉద్దేశం. ఆరోగ్య సూత్రంగా ఉత్తరాదిన ప్రారంభమైన పండుగ ప్రస్తుతం దేశమంతటా విస్తరించింది. సంప్రదాయ రంగుల స్థానాన్ని రసాయన రంగులు ఆక్రమించడంతో ఆరోగ్య, మానసిక సమస్యలు పండుగలోని ఆనందాన్ని హరించివేస్తున్నాయి.



- ఆరోగ్య సూత్రమే అసలు రహస్యం
- సంప్రదాయ రంగులతోనే మేలు
- రసాయనిక రంగులతో వ్యాధులు
- నేడు హోలీ పండగ

(విశాఖపట్నం/ సింహాచలం, ఆంధ్రజ్యోతి)

కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా భారతీయులంతా జరుపుకొనే ఏకైక పండుగ హోలీ. స్త్రీ పురుష, వయోభేదాలకు అతీతంగా, పేద, ధనిక తారతమ్యాల్లేకుండా సంబరంగా జరుపుకునే పండగ. శుక్రవారం హోలీ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

పురాణాల ప్రకారం హోలీ పండుగ విశిష్టతపై పలు కథనాలు ఉన్నప్పటికీ వేసవి ప్రారంభమయ్యే సమయంలో వ్యక్తిగత ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహించుకునే పండగ. సీజన్ మారుతున్నప్పుడు వాతావరణంలో తీవ్రమైన మార్పులు వచ్చి వైరల్ జ్వరాలు, జలుబు వచ్చే అవకాశాలు అధికం. వీటి నుంచి తట్టుకునేందుకు సహజసిద్ధమైన రంగుల పొడులను శరీరంపై చల్లుకుంటే అవి దివ్య ఔషధంగా పనిచేసి రోగనిరోధకశక్తిని పెంచి సహజసిద్ధమైన రక్షణ కవచంగా ఏర్పడతాయనేది నమ్మకం. కాగా సంప్రదాయ రంగుల స్థానంలో రసాయనిక రంగుల ప్రవేశం శారీరక రుగ్మతలకు కారణమవుతోంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

రంగులు చిమ్మేటప్పుడు శరీరంలోని ఏ భాగంపై పడతాయో చెప్పలేం. ఒక్కోసారి కళ్లు, ముక్కులోకి వెళ్లవచ్చు. ఇలా జరిగితే ప్రమాదం. కాబట్టి ముందు జాగ్రత్తలు తప్పనిసరి. కళ్లను పూర్తిగా కప్పేలా గూగుల్స్ (కళ్లజోళ్లు) పెట్టుకోవాలి. ముక్కుకు మాస్క్ వాడడం మంచిది. శరీరం అంతా కప్పి ఉండేలా దుస్తులు వేసుకోవాలి. సంప్రదాయ రంగులతో ఆరోగ్యానికి మేలు. వాటిని మనమే తయారు చేసుకోవచ్చు. బీట్‌రూట్, క్యారెట్, పచ్చటి కూరగాయలతో హోలీ రంగులు తయారు చేసుకోవచ్చు. పసుపు, కుంకుమ, పలు రంగుల్లో ఉన్న బంతిపూలతో పొడులు తయారు చేసుకుని వాడుకోవచ్చు.

సింహాచలంలో డోలోత్సవం

హోలీ పండగను డోలోత్సవం, కాముని పౌర్ణమి అని కూడా వ్యవహరిస్తారు. ఈ పండగను అన్ని వయసుల వారు రంగులు చల్లుకుంటూ ఆనందంగా నిర్వహిస్తారు. ఇదే రోజున కామదహనం జరిగినట్టు పురాణేతిహాశం. పార్వతీదేవి పరమేశుని వివాహమాడాలని భావించి దేవతల సహకారం కోరుతుంది. వారు మన్మథునికి ఈ బాధ్యతను అప్పగిస్తారు. మన్మథుడు పరమేశ్వరునిపై శరసంధానం చేస్తాడు. ఈశ్వరుడు ఆగ్రహించి మూడో నేత్రాన్ని తెరవడంతో దహనమవుతాడు. అప్పటి నుంచి ఫాల్గుణమాస పౌర్ణమి రోజున కామదహనం చేయడం ఆనవాయితీ. ఇక రాక్షస రాజైన హిరణ్యకశ్యపుడు అపరిమిత శక్తులను పొందాలని ఘోర తపస్సు చేసి బ్రహ్మ సాక్షాత్కారం పొందుతాడు. అతని కుమారుడు ప్రహ్లాదుడు మహావిష్ణు భక్తుడు. ఆగ్రహించిన హిరణ్యకశ్యపుడు తన కుమార్తె హోలిక ఒడిలో ప్రహ్లాదుని కూర్చుండబెట్టి చితిపై పెట్టి దహించాలని చూస్తాడు. విష్ణు ప్రభావంతో ప్రహ్లాదుడు బయటపడగా హోలిక దహనమవుతుంది. హోలిక త్యాగానికి గుర్తుగాజరుపుకుంటారు. ఇక కృష్ణుని ఛాయను గేలి చేస్తూ రాధ, చెలికత్తెలు రంగులు పూసి డోలాయమానం గోవిందం అంటూ డోలిక (ఊయల)లో ఊపడంతో వారికి పుణ్యఫలం దక్కుతుందని ప్రతీతి. దీంతో ఆ రోజు డోలోత్సవాన్ని నిర్వహిస్తారు. అడివివరం ఆరాధ్యదేవత పైడితలమ్మ కుమార్తెతో కల్యాణానికి అంగీకరించాలని స్వామి కోరగా ఆమె అంగీకరించడంతో స్వామి పరివారంతో కలిసి వేడుక జరుపుకోవడాన్ని డోలోత్సవంగా నిర్వహిస్తారు.

అలర్జీ రహిత రంగులు వినియోగించాలి



కెమికల్, అలర్జీ రహిత రంగులు మార్కెట్‌లో ఉన్నాయి. వీటిని మాత్రమే వాడాలి. కెమికల్స్‌తో కూడిన రంగులు వినియోగిస్తే స్కిన్ అలర్జీ, కళ్లల్లో ఇరిటేషన్, ఎగ్జిమా వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. దురదలు, మంట వెంటాడుతాయి. పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు అవసరం. ముఖ్యంగా కంటి లోపలకు రంగులు వెళ్లకుండా చూసుకోవాలి.

– డాక్టర్ పి.గురుప్రసాద్, చర్మవ్యాధుల నిపుణులు

భవనాల క్రమబద్ధీకరణపై శ్రద్ధచూపండి

- జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్



భీమిలి రెవెన్యూ డివిజనల్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మహారాణిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని కట్టడాల క్రమబద్ధీకరణపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో భీమిలి రెవెన్యూ డివిజన్ అధికారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీవో నంబర్-30 ఉద్దేశాలు, ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సూచించారు. 2019 అక్టోబరుకు ముందు జరిగిన ఆక్రమణలను పరిగణనలోకి తీసుకొని క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గాజువాక పరిధిలో భూముల క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజల సంతృప్తిని కొలమానంగా తీసుకుని రెవెన్యూ సిబ్బంది పనితీరును అంచనా వేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, ఏవో ఈశ్వరరావు, తహసీల్దార్లు, డీటీలు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విశాఖ జట్లు ఎంపిక

పెదవాల్తేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14 నుంచి 16 వరకూ కడప జిల్లా పులివెందులలోని వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు అకాడమీలో జరగనున్న 34వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అంతర్ జిల్లా కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా బాలురు, బాలికలు కబడ్డీ జట్లను గురువారం ఎంపిక చేసినట్టువిశాఖ జిల్లా సంఘం కార్యదర్శి జేఎస్వీ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

సబ్ జూనియర్ బాలురు జట్టు : డి.ప్రదీప్, టి.దుర్గాప్రసాద్, పి.శ్రీను, సీహెచ్ సంపత్, ఎం.సందీప్, డి.ప్రసాద్, ఎన్.మణికంఠ, ఆర్.కార్తీక్, జి.వేమంత్, ఎం.హేమసతీష్, బి.శ్రీను, ఎల్.హేమసుందర్, బాలురు జట్టు కోచ్‌గా కె. జయ సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, మేనేజర్‌గా ఎం.శివ ఎంపికయ్యారు.

బాలికల సబ్ జూనియర్ జట్టు : పి.ద్రాక్ష, ఎ.మేఘన, కె.పుణ్యవతి, కె.జానకి, జి.కుసుమ, కె.ప్రణీతి, వై.హారిక, కె.అనురాధ, కె. సౌమ్య, పి.అక్షయ, జి.కావ్య, సీహెచ్ పావని, బాలికల జట్టు కోచ్‌గా పి.చైతన్య (డీఎస్‌ఏ) వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా సంఘం కార్యదర్శి జేఎస్వీ ప్రసాద్ రెడ్డి, జాయింట్ కార్యదర్శి, సీహెచ్ గోవింద్, కోశాధికారి లక్ష్మణరావు, జాతీయ స్థాయి క్రీడాకారులు వైవీ శ్రీనివాస్, వి.కనకరాజు, వి.రామకృష్ణ తదితరులు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

టెన్త్ పరీక్షల పర్యవేక్షణకు 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

- డీఈవో ప్రేమ్‌కుమార్

భీమునిపట్నం (రూరల్) మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలు విశాఖ జిల్లాలో సక్రమంగా నిర్వహించేందుకు 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురువారం భీమిలి రూరల్‌లో పరీక్షా కేంద్రాల పరిశీలనకు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ విశాఖ జిల్లా అంతా ఈ స్క్వాడ్‌లు పర్యటిస్తాయన్నారు. ప్రతి బృందంలో కనీసం 5 గురు సభ్యులు ఉంటారని, బృందంగా ఈ స్క్వాడ్ సిబ్బంది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తూ మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూస్తారని అన్నారు. విశాఖ జిల్లాలో ఏర్పాటు చేసిన 134 కేంద్రాలను వీరు పరిశీలిస్తారని తెలిపారు. పరీక్షల పర్యవేక్షణ నిఘా కోసం జిల్లాను 14 రూట్లుగా విభజించామని, ప్రతి రూటుకు ఒక రూట్ అధికారి, సహాయ రూట్ అధికారి ఉంటారని చెప్పారు. వీరు కూడా పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. జిల్లాలో పరీక్షా పత్రాలను పోలీసు స్టేషన్‌లో భద్రపరిచామని, ప్రతిరోజూ ఉపాధ్యాయులు ఈ పరీక్షా పత్రాలను తీసుకుని పరీక్షా కేంద్రాలకు వెళతారన్నారు. అయితే 9 పరీక్షా కేంద్రాలు మాత్రం పోలీసుస్టేషన్లకు అందుబాటులో లేవని. వీటిని సి కేటగిరి కేంద్రాలు అంటారని ఇటువంటి ప్రతి కేంద్రానికి ఒక కస్టోడియన్‌ని కూడా నియమించినట్టు డీఈవో తెలిపారు.

సినిమా గైడ్

- **కోర్ట్ :** సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
- **దిల్‌రుబా :** జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర,
- **మజాకా :** రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 46, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 32 దొండకాయలు 38, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 56, అల్లం (పాతది)50, బరబాటి 36, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 48, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

అవయవదానంతో మరొకరికి ప్రాణదానం

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ
- ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్డులో ర్యాలీ

బీచ్ రోడ్డు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అవయవదానం చేయడం ద్వారా ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న మరొకరికి ప్రాణదానం చేసినట్టేనని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన ర్యాలీ, సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవయవదానం చేయండి ... ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపండని పిలుపునిచ్చారు. కిడ్నీ సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే ఎటువంటి దుష్ఫలితాలుండవని వెల్లడించారు. ఆధునిక వైద్య శాస్త్రంలోని పురోగతి కారణంగా అవయవాలను మార్చి ప్రాణాలను నిలబెట్టగల సామర్థ్యం మన వైద్యులకు ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జీవన్‌ధాన్ కార్యక్రమంలో భాగంగా జీవించివున్న వారు తమ అవయవాలను ఎలా దానం చేయాలో తెలుసుకోవాలన్నారు. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను సేకరించి, ప్రాణాపాయంలో ఉన్న వారికి అమర్చేందుకు వీలుగా మన దేశంలో చట్టబద్ధమైన మార్గదర్శాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రజలంతా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన అలవాట్ల ద్వారా కిడ్నీలను కాపాడుకోవాలన్నారు. కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవడం, సమస్యలు ఎదురైతే నివారణ చర్యలు పాటించడం ముఖ్యమని తెలిపారు. అవయవదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ తదితరులు



సైకత శిల్పం వద్ద విద్యార్థులు

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులతో సతమతమవుతున్న రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. డయాబెటిస్, హై బ్లడ్ ప్రెషర్ (అధిక రక్తపోటు)తో బాధపడే వారిలో కిడ్నీలు విఫలమవుతున్నాయని వివరించారు. కిడ్నీల ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇది చాలా మంచి కార్యక్రమమన్నారు. అవయవ దానానికి ప్రతి ఇక్కరి సహకారం అవసరమన్నారు. చాలామంది కిడ్నీలు, లివర్ పాడై అవయవాల మార్పు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. సకాలంలో అవి అందుబాటులోకి వస్తే మరింత మందికి ప్రాణదానం చేయవచ్చని సూచించారు. అనంతరం ఆర్‌కే బీచ్ నుంచి వైఎస్సీపీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైతిక శిల్పాన్ని కలెక్టర్, సీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, ఏఐఎస్‌యూ ఆస్పత్రి ఈడీ డాక్టర్ అమిత్ సాప్లే, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, డాక్టర్ జి.శ్రీధర్, డాక్టర్ ఉదయ్ దీపక్‌రావు గజారే, డాక్టర్ వి.వైష్ణవి, పలువురు నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నుంచి పిల్లల రక్షణకు ప్రత్యేక చట్టాలు



సదస్సులో పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటశేషమ్మ తదితరులు

మద్దిలపాలెం, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : లైంగిక వేధింపుల నుంచి పిల్లలకు రక్షణ కల్పించడానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటశేషమ్మ తెలిపారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన పోక్సో చట్టంపై అవగాహన సదస్సులో ఆమె మాటాడుతూ పద్దెనిమిదేళ్లలోపు బాలికలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కోసం 2012లో భారతప్రభుత్వం పోక్సో చట్టాన్ని తెచ్చిందన్నారు. లైంగిక వేధింపులు, అశ్లీల చిత్రాల నుంచి పిల్లలను రక్షించడానికి, అటువంటి నేరాల విచారణకు ఈ చట్టం ద్వారా ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేశారన్నారు. పోక్సో చట్టం ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందన్నారు. అలాగే కళాశాలల్లో ర్యాగింగ్‌లకు పాల్పడకూడదని సూచించారు. ర్యాగింగ్‌లకు పాల్పడి మంచి భవిష్యత్ నాశనం చేసుకోకూడదని హితవు పలికారు. కళాశాలలో స్నేహపూర్వకంమైన వాతవరణంతో విద్యార్థులు మెలిగి ఉన్నత భవిష్యత్‌కు నైపుణ్యం పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డెరెక్టర్ జి.జయదేవి, కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు పి.ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, ప్రసన్న, లక్ష్మణరావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్లు నిర్మించండి

విశాఖ రెసిడెన్సీ కాలనీ ఆధ్వర్యంలో హనుమంతవాక వద్ద ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న నిరసనకారులు

ఆరిలోవ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉండే హనుమంతవాక జంక్షన్‌లో అత్యవసరంగ ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరుతూ విశాఖ రెసిడెన్సీ కాలనీ ఆధ్వర్యంలో స్థానిక రెసిడెన్స్ కాలనీ వాసులు, అపార్ట్‌మెంట్ వాసులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అసోషియేషన్ సభ్యులు ప్లకార్డులను పట్టుకొని వారి డిమాండ్‌ను వినిపిస్తూ నినాదాలు చేశారు. అలాగే. నగరంలోని మద్దిలపాలెం, షీలానగర్, పాత గాజువాక ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోందని, ఆయా ప్రాంతాల్లో కూడా ఫ్లై ఓవర్ నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నగరంలోని ఈ ప్రాంతాల్లో ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపడితే నగర వాసులకు ఎంతో మేలు చేసినట్టు అవుతుందని పేర్కొన్నారు.

అలాగే అవసరమైన ప్రాంతాల్లో పార్కులు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు. బీచ్‌లో ప్రవేశాలకు ఎలాంటి రుసుములు వసూలు చేయవద్దని కోరారు.

ఆస్తి పన్ను పెంపు, స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు వద్దని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.ప్రకాశరావు, బీబీ గణేష్, బి.గురప్ప, పిట్టా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డబ్బుతో భర్త పరారీ : పోలీసులకు భార్య ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తనను మోసం చేసి డబ్బు, ద్విచక్రవాహనం, బంగారు గొలుసుతో పరారయ్యాడంటూ బాధిత మహిళ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి.

జాలారి ఎండాడలో నివాసం ఉంటున్న ఇందుల దేవికి వడ్రంగి పని చేస్తున్న కిరణ్‌తో 2018లో ప్రేమ వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ నెల పదో తేదీన దేవి సోదరుడి బంగారు గొలుసు, రూ. లక్ష రూపాయలు, ద్విచక్ర వాహనంతో భర్త కిరణ్ పరారయ్యాడు. దీనిపై బాధిత మహిళ దేవి ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొద్ది రోజులుగా తన భర్త ఓ మహిళతో ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడుతున్నాడని, ఇద్దరూ కలిసి ఒకసారి తన కంట పడ్డరని, ఆ మహిళతోనే తన భర్త పరారై ఉంటాడని దేవి ఫిర్యాదులో పేర్కొంది. పలు చోట్ల వెతికినా, భర్త ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలపింది. ఈ ఫిర్యాదుపై ఎంవీపీ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



ఆరిలోవ, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌కెఎల్‌నగర్‌లో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి 12వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి జల, క్షీర, పాంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. గురువారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

జిమ్ భాగస్వామిపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామశాల వ్యాపారంలో భాగస్వాముల మధ్య వివాదం నేపథ్యంలో ఒకరిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. శివాజీపాలెంలోని రామలక్ష్మీ అపార్టుమెంట్ ఆవరణలో కళ్యాణపు ప్రమీల చిన్న కుమారుడు జయకృష్ణ ఎస్కే. అష్మాబీ సంయుక్తంగా వ్యాయామశాల ఏర్పాటు చేశారు. ఇందులో అష్మాబీ రూ.పది లక్షలు పెట్టుబడి పెట్టారు. భాగస్వాముల మధ్య విభేదాలు రావడంతో అగ్రిమెంట్ ప్రకారం కళ్యాణపు జయకృష్ణకు అతడి పెట్టుబడిని అష్మాబీ చెల్లించాల్సి ఉంది. ఈ నెల 3న జయకృష్ణ తన తల్లితో కలసి జిమ్‌లోకి వెళ్లారు. అక్కడ ఉన్న అష్మాబీ, ఆమె సోదరుడు ఎస్కే. మున్నా, అతడి స్నేహితుడు డి.రాజేష్‌లు జయకృష్ణను బెదిరించారు, అసభ్య పదజాలంతో దూషించడంతో వారిపై కేసు నమోదు చేశారు. హెచ్సీ సత్యనారాయణ దర్యాప్తుచేస్తున్నారు

విజిలెన్స్ విచారణపై హర్షం

వెంకోజీపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూ మాజీ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డిపై విజిలెన్స్ కమిటీ వేస్తున్నట్టు అసెంబ్లీలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడంపై ఏయూలో విద్యార్థులు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, పరిరక్షణ సమితి సభ్యులు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మాజీ వీసీ పరిపాలనలో 2019-24 మధ్య జరిగిన అనేకమైన ఆర్థిక అవకతవకలు, అన్యాయాలు, అక్రమాలపై విచారణ జరపాలని, సుదీర్ఘకాలంగా ఉద్యమాలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి లోకేష్ కమిటీని నియమించడంపై పరిరక్షణ సమితి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ స్థాయిలో ఏయూ విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నోయిడాలోని అమిటీ యూనివర్సిటీలో ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో ఏయూ తరపున పాల్గొన్న ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగానికి చెందిన బి.గోపిచంద్, జి.దీక్షితలు ఏయూ తరపున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. క్లే మోడలింగ్ విభాగంలో గోపిచంద్ మూడవ స్థానాన్ని, రంగోలిలో దీక్షిత నాలుగవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అభినందించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నతంగా రాణించాలి'

వెంకోజీపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో బీఈడీ కోర్సును పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ఉపాధ్యాయ వృత్తిలో అడుగుడి ఉన్నతంగా రాణించాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు పేర్కొన్నారు. గురువారం విద్యా విభాగంలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు బ్రెయిలీ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉన్న సమయాన్ని విభిన్న నైపుణ్యాలు, సామర్థ్యాలను అందిపుచ్చుకోవడానికి వినియోగించుకోవాలని సూచించారు. వర్సిటీ నుంచి బయటకు వెళ్లే సమయానికి ఉపాధి అవకాశం చేతిలో ఉండే విధంగా ప్రతి విద్యార్థి తనను తాను మలుచుకోవాలని సూచించారు. అనంతరం విభాగంలో కాగ్నిజెంట్ ఫౌండేషన్ నుంచి స్కాలర్‌షిప్ పొందిన 13 మంది విద్యార్థులు తమతో పాటు చదువుకుంటున్న సహచర విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే బ్రెయిలీ లిపికి సంబంధించిన కిట్లను బహూకరించారు. విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ ఇతరులకు సహాయం చేయాలని ఆలోచన ఎంతో ఉన్నతమైనదన్నారు.కార్యక్రమంలో విభాగాచార్యులు డాక్టర్ ప్రకాష్, ఆలీ, కె.రాము, సలోమి, హేమలత, వినీల, మూర్తి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఇస్కాన్‌లో గౌరపూర్ణిమ ఉత్సవాలు

సాగర్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ సాగర్‌నగర్ మందిరంలో శుక్రవారం గౌరపూర్ణిమ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు ఇస్కాన్ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబదాసు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలతో పాటు భజనలు, సంకీర్తనలు ఉంటాయన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి సాంబదాస్, మాతాజీ నితాయిసేవనిలతో ప్రవచన కార్యక్రమంఉంటుందన్నారు.

సుమారు వందల కిలోల పువ్వులతో పుష్పాభిషేకం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

పబ్లిక్ నోటీసు

[illegible]

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

CLASSIFIEDS

PASSPORT LOST
I SHAIK ABDUL MALIK S/o. Shaik Mahaboob Ali. Lost my Passport bearing no Y7322878 while shifting my house (in surrounding area of Gopalapatnam Police Station) on 10-01-2025. If anyone find it please kindly contact me at 9177133700.

CHANGE OF NAME
★ I, NADIMPALLI SRICHARISHMASATYALAVANYA (Old Name), Wo. Pakalapati Hari Krishnam Raju, resident of 1-142, Raindram, Bondapalli, Vizianagaram. Change my name from NADIMPALLI SRICHARISHMASATYALAVANYA (Old Name) to PAKALAPATI SRICHARISHMASATYALAVANYA (New Name). Shall henceforth be known as PAKALAPATI SRICHARISHMASATYALAVANYA (New Name), Wo. Pakalapati Hari Krishnam Raju, for all purposes.
AJV_231280

PLOTS FOR SALE
★ దువ్వాడకు దగ్గరలో వెంటనే ఇల్లు నిర్మాణానికి అనువైన ఇంటి స్థలములు కలవు. బ్యాంకు లోను సదుపాయం కూడా కలదు. సంప్ర॥ 9133447955
AJV_231164

FLAT FOR SALE
★ Lux 3 BHK Ready to Occupy Flats at Yendada Main Road South Facing 1510 sft. Rate 81 Lakhs, including amenities, No GST. Last 2 Flats. Cont.: 7989344212
AJV_13473

WANTED
Wanted Accounts Executive to work a reputed company at Guntur. Mini. 2 to 3 yrs. experience in tally. Salary 20000/- to 25000/-. Cont : 9133399257.
AJG-368

WANTED
★ అక్కయ్యపాలెంలో ప్రముఖ చిల్డ్రన్ క్లినిక్‌లో పనిచేయుటకు స్టాఫ్ (F) కావలెను. Qlf: Inter (or) MPHW. వెంటనే సంప్రదించండి. 79815 31990
AJV_231279

WANTED
గుంటూరులోని ప్రముఖ కంపెనీకి కారు డ్రైవర్ కావలెను. కనీసం 10 సం.ల నుండి 15 సం.ల అనుభవం కలిగి హైఎండు కారు నడుపగల డ్రైవర్ కావలెను. సంప్ర॥ 9133399257.
AJG-365

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

బృందావన్ పార్కులో అభివృద్ధి పనులకు శ్రీకారం

సీతమ్మధార, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 24వ వార్డు టీపీటీ కాలనీ బృందావన్ పార్కులో అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్ శివప్రసాద్, బీజేపీ నేత, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు రూ.10.77 లక్షలతో పార్కు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జెడ్సీ శివప్రసాద్


కార్యక్రమంలో శ్యామలా దీపిక, కార్పొరేటర్ ఉషశ్రీ

వెంకటేశ్వర కాలనీలో...

అక్కయ్యపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు వేంకటేశ్వరకాలనీలో రూ.14 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక గురువారం శంకుస్థాపన చేశారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, టీడీపీ, బీజేపీ నాయకులు శ్రీదేవి, రఘునాథ్, ఏఈ రమణమ్మ పాల్గొన్నారు.

వెలిగిన విద్యుత్ దీపాలు



తాటిచెట్లపాలెం- రైల్వే న్యూకాలనీ రోడ్డులో వెలుగుతున్న దీపాలు

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెం జాతీయరహదారి జంక్షన్ నుంచి రైల్వేన్యూకాలనీ జంక్షన్ వరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న విద్యుత్‌దీపాలను జీవీఎంసీ అధికారులు గురువారం వెలిగించారు. 'చీకటిపడితే ఆ రోడ్డులో అంధకారమే' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు మరమ్మతులు చేయడంతో దీపాలు వెలిగాయి. దీంతో వాహనచోదకులు ఆనందం వ్యక్తంచేశారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

సీతమ్మధార, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు గుడ్డ సంచులను వాడాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచుల వాడకం మానాలని శానిటేషన్ సెక్రటరీ, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. సీతమ్మధార రైతుబజార్ సమీపంలో గల దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. చైతన్యనగర్, మద్దిలపాలెం ప్రాంతాల్లో ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తున్న వ్యాపారులకు అపరాధ రుసుం విధించడంతో పాటు నిషేధంపై వారికి అవగాహన కల్పించారు.

ఘనంగా అన్నసమారాధన

అల్లిపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రేణుక ఎల్లమ్మతల్లి జాతర సందర్భంగా గురువారం అన్నసమారాధన చేశారు. బి.పోలారావు, సూర్యనారాయణమూర్తి, వెంకట అప్పలనాయుడు, నీలకంఠం, ప్రసాద్ సహకరించారు.





విశాఖ, షాలిమార్, చెర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-షాలిమార్, విశాఖ-చెర్లపల్లి మధ్య ఒక ట్రిప్పు (రానుపోను) ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-షాలిమార్-విశాఖ: 08577 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 16 ఉదయం 11.30 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు వేకువజామున 3 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 17 ఉదయం 5 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-చెర్లపల్లి-విశాఖ: 08579 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 16న సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8 గంటలకు చెర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08580 నంబరు గల ప్రత్యేక రైలు 17న ఉదయం 10 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 10 గంటలకు విశాఖ చేరుతుంది.

చెర్లపల్లి, నహర్లగున్ మధ్య

దువ్వాడ మీదుగా చెర్లపల్లి, నహర్లగున్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు ప్రవేశపెట్టామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07046 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 15, 22, 29న (ప్రతి ఆదివారం) ఉదయం 8.40 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి రాత్రి 9.13 గంటలకు దువ్వాడ, సోమవారం సాయంత్రం 4 గంటలకు నహర్లగున్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07047 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 18, 25, ఏప్రిల్ 1న (ప్రతి మంగళవారం) మధ్యాహ్నం ఒంటి గంటకు నహర్లగున్‌లో బయలుదేరి గురువారం ఉదయం 8.15 గంటలకు దువ్వాడ, రాత్రి 9.30 గంటలకు చెర్లపల్లి చేరుతుంది.

బీచ్‌లో గుర్తు తెలియని మృతదేహం

మహారాణిపేట, మార్చి13 (ఆంధ్రజ్యోతి): సాగర తీరంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు మహారాణిపేట పోలీసులు తెలిపారు. నోవాటెల్ హోటల్ ఎదురుగా సముద్రంలో సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో తీరానికి కొట్టుకువచ్చిందన్నారు. నాలుగురోజుల క్రితం సముద్రంలో పడి మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచి, కేసు నమోదు చేశామన్నారు. వివరాలు తెలిసిన వారు మహారాణిపేట పోలీసులను సంప్రతించాలన్నారు.

రైల్వే స్టేషన్‌లో 11 కేజీల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని 11 కేజీల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, జీఆర్పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి సిబ్బందితో గురువారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో తెలంగాణకు చెందిన చిరుమామిళ్ల గోపి గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. అతడిని కోర్టుకు తరలించారు.

ఉడా కాలనీలో అగ్ని ప్రమాదం

మురళీనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వవార్డు మాధవధార ఉడాకాలనీలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. కాలనీలోని ఎంఐజీ-146 నిమిష్ విహార్ గ్రూప్ హౌస్‌లోని దిగువ అంతస్తు ఫ్లాట్‌లో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఏసీ నుంచి మంటలు వ్యాపించినట్టు ఇంటి యజమాని వెంకటరావు తెలిపారు. అప్రమత్తమై బయటకు వచ్చేసి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చామన్నారు. ప్రమాదంలో సామగ్రి కాలి బూడిదయ్యాయి. మర్రిపాలెం ఫైర్‌స్టేషన్ సిబ్బంది మంటల్ని అదుపు చేశారు. ఫైర్ ఆఫీసర్ ఏడీఎఫ్ఓ ప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది అర్జున్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఏసీ పెద్ద శబ్దంతో పేలిపోవడంతో చుట్టుపక్కల జనం అక్కడకు చేరుకున్నారు.

క్రీడా పోటీల్లో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ

మహారాణిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర వైద్య కళాశాలల క్రీడా పోటీల్లో ఏఎంసీ విద్యార్థులు ప్రతిభ కనబరిచా రు. గన్నవరంలోని సిద్ధార్థ వైద్య కళాశాలలో ఈ నెల 8 నుంచి జరిగిన పోటీల్లో ఏఎంసీ జట్టు విజేతగా నిలిచింది. బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయస్థానం సాధించారు. విజేతలను ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ భానుసతీశ్, పీడీ డాక్టర్ ఎంఎస్ఎన్.పాత్రుడు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట వేయండి: కలెక్టర్


రచయిత్రి మొల్లకు నివాళులర్పిస్తున్న కలెక్టర్

డాబాగార్డెన్స్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు పెద్దపీట వేయాలని కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో హౌసింగ్ శాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎంఏవైలో ఇళ్లు మంజూరై వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న వాటికి అదనంగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీవీటీజీల అసంపూర్తి గృహాలను పూర్తి చేయడానికి అదనపు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. జిల్లాలో పీఎంఏవై అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటి, రెండో ఆప్షన్‌లో 24,696 గృహాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 81,619 మంది లబ్ధిదారులకు రూ.43.4 కోట్ల అదనపు సాయం అందుతుందన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పనపై లేఅవుట్ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, డీఈలు సూర్యారావు, నారాయణప్రసాద్, లేఅవుట్ ఇన్‌చార్జులు, ఏసీడీలు రమణమూర్తి, వర్మ, సోమన్నారాయణ, యూసీడీ పీడీ సత్యవేణి, డీసీవో ప్రవీణ, ఎస్‌డీసీలు శేష శైలజ, సునీత పాల్గొన్నారు.

ఆదర్శ కవయిత్రి మొల్ల

కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. మొల్ల రచనా శైలి, జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు.జేసీ మయూర్ అశోక్, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, చిరంజీవులు పాల్గొన్నారు.

ఆందోళన వీడితే మీదే విజయం

అక్కయ్యపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఆందోళన వీడితే విజేతలుగా నిలుస్తారని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు అన్నారు. గ్రేటర్ 26వ వార్డు శంకువానిపాలెంలోని వాగ్దేవి పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను నిర్వహించారు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదివి, పరీక్షలు రాసి ఎక్కువ మార్కులు సాధించి అత్యున్నత స్థాయిలో నిలవాలన్నారు. విద్య నేర్పిన గురువులను, తల్లిదండ్రులను మరచిపోకూడదని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌చంద్‌జైన్, ఎంవీ రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీవీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఎల్ శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో దుకాణాలకు భరోసా ఇవ్వండి


ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసు స్టేషన్ ఎదుట కార్మికులు

మురళీనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో దుకాణాల దగ్గర ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం సూచించాలని గురువారం వర్తకులు మాధవధార ఎయిర్‌పోర్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులకు వినతి పత్రం అందించారు. ఉత్తర నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పి.చంద్రశేఖర్‌తో కలిసి కంచరపాలెం మెయిన్ రోడ్డు వర్తకులు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కంచరపాలెం మార్కెట్ వర్తక సంఘం అధ్వర్యంలో నడుస్తున్న ఈ మార్కెట్‌లో జీవనోపాధి పొందుతున్నామని, మార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి లోపలకు ఉందన్నారు. మెయిన్ రోడ్డులో తోపుడు బళ్లు, ఫ్రూట్ షాపులు పెట్టి మెట్టు జంక్షన్‌ను గందరగోళం చేస్తున్నారన్నారు. వీరికి కంచరపాలెం బ్రిడ్జి కింద దుకాణాలిచ్చినా, ఇక్కడే వ్యాపారం చేస్తుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయని, సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

పేదలకు తోపుడు బండ్ల పంపిణీ

అల్లిపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలోని 33వ వార్డులో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మీ, జనసేన నేత గోపీకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ జెండాను గురువారం ఆవిష్కరించారు. అనంతరం పేద కుటుంబాల ఉపాధి కోసం తోపుడు బండ్లను పంపిణీ చేశారు. పిఠాపురంలో శుక్రవారం జరగనున్న సభకు అధికసంఖ్యలో తరలివెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన అధ్యక్షుడు ఆకుల రాజు, జన సైనికులు పాల్గొన్నారు.

వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరం

కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వికాస్ పాండే

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరమని, వినియోగదారుల హక్కుల కౌన్సిల్ జాతీయ ప్రెసిడెంట్ డాక్టర్ వికాస్ పాండే పేర్కొన్నారు. వినియోగదారుల అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం దసపల్లా హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతిరోజూ అనేక వస్తువులను కొనుగోలు చేస్తుంటామని, అనేకచోట్ల మోసపోతుంటారని, వాటిపై ప్రజలకు అండగా కౌన్సిల్ ఉంటుందన్నారు. వినియోగదారులకు హక్కులపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 15న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ సదస్సు, ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వశాఖలకు చెందిన ఉన్నతాధికారులు సదస్సుకు హాజరవుతారన్నారు. నగరంలోని ప్రజలంతా హాజరుకావచ్చని, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ మురళీనాథ్, జాతీయ కార్యదర్శి చంద్రశేఖర్, అధికార ప్రతినిధి బాలకృష్ణ, సంస్థ నేషనల్ ఆడిటర్ ఎన్ఎస్‌వీ ప్రసాద్, సభ్యులు విక్రమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిలో అదనంగా 18.75 మెగావాట్ల సోలార్ పవర్

- మే నాటికి ఎఫ్‌జీడీ పనులు పూర్తి
- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ సమీర్ శర్మ

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పరవాడలోని సింహాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంటు ఉందని, అదనంగా 18.75 మెగావాట్లతో మరొకటి ఏర్పాటు చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ తెలిపారు. విశాఖపట్నంలోని నోవాటెల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఇతర అధికారులతో కలిసి మాట్లాడారు. ఏలేరు కాలువకు మరమ్మతులు జరుగుతున్నప్పటికీ సింహాద్రికి నీటి సమస్య లేదన్నారు. ప్రత్యేకంగా రిజర్వాయర్ ఉందని, 85 శాతం ప్లాంటు అవసరాలకు సముద్రపు నీటినే ఉపయోగిస్తున్నందున ఇబ్బందులు లేవన్నారు. రాష్ట్రంలో పగటి పూట ఎక్కువ సోలార్ విద్యుత్ అందుబాటులో ఉన్నందున ప్లాంటు లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) 70 శాతంగా ఉందని, డిమాండ్ పెరగడం, సోలార్ విద్యుత్ అందుబాటులో లేకపోవడం వల్ల పీఎల్ఎఫ్ 90 శాతానికి చేరుతున్నదన్నారు.ప్లాంటు నుంచి కాలుష్యం తగ్గించడానికి ఫ్లూ గ్యాస్ డీ సల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) విధానం అమల్లోకి తెచ్చామని, నాలుగు యూనిట్లకు చిమ్నీలను మారుస్తున్నామన్నారు. వీటికి నైట్రోజన్ ఆక్సైడ్ బర్నర్‌లు అమర్చాలన్నారు. రూ.870 కోట్లతో ఈ ప్రాజెక్ట్ చేపట్టామని, ఈ మార్చికే పనులు పూర్తి కావాల్సి ఉందని, ఇప్పటికి రెండు చిమ్నీలు పూర్తయ్యాయని, మిగిలినవి మే చివరికి పూర్తవుతాయన్నారు. ప్లాంటు నుంచి వస్తున్న ఫ్లైయాష్‌ను ఇటుకల తయారీదారులకు, సిమెంట్ పరిశ్రమలకు, జాతీయ రహదారుల నిర్మాణానికి సరఫరా చేస్తున్నామన్నారు. సమావేశంలో జనరల్ మేనేజర్ (ఓఅండ్‌ఎం) వీకే జెనా, జనరల్ మేనేజర్ పద్మప్రియ, ఏజీఎంవి.జయన్, హెఆర్‌హెడ్ పాత్ర పాల్గొన్నారు.





ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై విచారణ

... 5వ పేజీ తరువాయి

మైదానాన్ని తయారుచేసేందుకు కొందరు బయటి వ్యక్తులు నిధులు ఇచ్చారు. ఎంత ఇచ్చారు?, ఎంత ఖర్చు చేశారన్నది ఎవరికీ తెలియదు. ఈ నిధుల వినియోగం లెక్క తేల్చాల్సి ఉంది.

- వాహనాలకు డీజిల్ బిల్లుల్లోనూ అడ్డగోలుగా మెక్కేసినట్టు ఆరోపణలున్నాయి. పాడైనవాహనాల విక్రయించడం (స్క్రాప్)లోనూ అవకతవకలు జరిగాయంటారు.
- వీసీ చాంబర్‌ను ప్రసాదరెడ్డి పూర్తిగా వైసీపీ కార్యాలయంగా మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి సీఎం జగన్, దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి, అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి పుట్టినరోజు వేడుకలను జరిపారు.
- అనేక కోర్సులను పూర్తిగా ఎత్తేశారు. ఫీజులను ఇష్టానుసారంగా పెంచేశారు. తనకు నచ్చని ఎంతోమంది గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించారు.
- రాష్ట్రంలో మరే వర్సిటీలో లేనివిధంగా ఎయిడెడ్ ఫ్యాకల్టీని వర్సిటీలోకి తీసుకువచ్చారు. ఇందుకు భారీగానే వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

పెరుగుతున్న బైక్ ప్రమాదాలు

... 5వ పేజీ తరువాయి

ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాల సంఖ్య రానురాను పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. 2023లో ద్విచక్ర వాహన ప్రమాదాలు 350 జరిగితే అందులో 95 మంది వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. 2024లో 295 ద్విచక్ర వాహనాలు రోడ్డు ప్రమాదానికి గురైతే 130 మంది ప్రాణాలు కోల్పోయారు. 2025లో జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే 54 బైక్‌లు ప్రమాదాలకు గురైతే...దాదాపు 21 మంది మృతిచెందడం విశేషం. ఏటేటా ద్విచక్ర వాహన ప్రమాదాలు, వాటితోపాటు మరణాల సంఖ్య కూడా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొందరు అపరిమిత వేగంతో వాహనాలు నడుపుతూ హఠాత్తుగా ఏదైనా అడ్డువస్తే అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నెల ఐదో తేదీ రాత్రి రైల్వేన్యూకాలనీ-కంచరపాలెం రోడ్డులో బైక్ రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఆరున తెల్లవారుజామున హనుమంతవాక జంక్షన్‌లో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. అదేరోజు హెచ్‌పీసీఎల్ గేటు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. గురువారం ఉదయం కూర్మన్నపాలెం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడే ప్రాణాలు కోల్పోయారు.

పోలీసుల అవగాహన కల్పిస్తున్నా బేఖాతరు

వాహనాన్ని అపరిమిత వేగంతో నడపడం వల్ల ఎదురయ్యే అనర్థాలు, ప్రమాదం జరిగిన తర్వాత పరిస్థితులపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మైనర్ డ్రైవింగ్, అధిక శబ్దం ఇచ్చే సైలెన్సర్లతో కూడిన వాహనాలను నడిపే వారిపై కేసులు నమోదుచేస్తున్నారు. అయినప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదు.

70 ఏళ్లు దాటితే ఆయుష్మాన్ వయో వందన కార్డులు

... 5వ పేజీ తరువాయి

కవరేజీ పరిధిలోకి వచ్చే వ్యక్తులు, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం సభ్యులు ఈ పథకం కింద ప్రయోజనం పొందేందుకు అర్హులన్నారు. జిల్లాలో సీనియర్ సిటిజన్లు ఆయుష్మాన్ వయో వందన కార్డులు పొందేందుకు సమీపంలోని ఎంప్యానెల్డ్ ఆస్పత్రుల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్వీయ రిజిస్ట్రేషన్‌కు ఆయుష్మాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 14555 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చునని లేదా 1800110770 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు.

క్లాప్ వాహనాలకు బ్రేక్?

... 5వ పేజీ తరువాయి

బాగానే నడుపుతున్నానని, బిల్లులు మాత్రం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేయడం షరామామూలుగా మారిపోయింది. ఈ విషయాన్ని అధికారులు కూడా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలదృష్టికి తీసుకువెళ్లడం, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఫిర్యాదులే వస్తుండడంతో క్లాప్ వ్యవస్థపై సమీక్షించాలని నిర్ణయించారు. క్లాప్ వాహనాలకు రూ.64 వేలు అద్దె చెల్లించడం కంటే, ఏ నగరానికి ఆ నగరం గతంలో మాదిరిగా చెత్త సేకరణ వాహనాలకు సంబంధించి టెండర్లు పిలుచుకుంటే ఎలా ఉంటుందనే దానిపై చర్చిస్తున్నట్టు సమాచారం. నగరాన్ని కొన్ని క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టర్‌కు అవసరమైన వాహనాలను సమకూర్చేలా టెండర్లు ఆహ్వానిస్తే చెత్త సేకరణ మెరుగుపడుతుందని అధికారులు అభిప్రాయపడినట్టు తెలిసింది. ఇటీవల నగరానికి వచ్చిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభి వద్ద క్లాప్ వాహనాల పనితీరు గురించి అధికారులు ప్రస్తావించగా, క్లాప్ వ్యవస్థను రద్దు చేసే యోచనలో ఉన్నట్టు పరోక్షంగా సంకేతాలిచ్చారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కలెక్టర్ సమీక్ష

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమాలను వార్డు స్థాయి ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పీ4 సర్వేను 18వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ పి.శివప్రసాదరాజు, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్‌వీ నరేష్, సీసీపీ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

జగదీష్, కార్పొరేటర్లు బొండా జగన్, ఎం.ముత్యాలునాయుడు, టీడీపీ నాయకుడు నల్లూరు సూర్యనారాయణలు టిప్పర్ యజమానితో మాట్లాడారు. ఒక్కొక్కరికి రూ.4 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించడంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. నక్కా కృష్ణకు భార్య సింహాచలం, ఇద్దరు కుమార్తెలు, ద్రోణాద్రి రాంబాబుకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఉమా నీలకంఠుడి హుండీ ఆదాయం రూ.2.59 లక్షలు

సీతమ్మధార, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 24వ వార్డులో గల నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని గురువారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. ఆలయంలో 91 రోజులకు గాను హుండీల ద్వారా భక్తులు రూ.2,59,474 సమర్పించుకున్నారు. సేవా పీఠం భక్తులు హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై స్థానికులకు అవగాహన

కంచరపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో ప్రజలు సరైన పాత్ర పోషించాలని కంచరపాలెం సీఐ రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గాంధీనగర్‌లో గురువారం అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.





హోలీ.. రంగేళి!

హోలీ రంగుల పండుగ. సీజన్‌మారే సంధికాలంలో శరీరాన్ని చుట్టుముట్టే వ్యాధుల నుంచి రక్షణ కోసం పలు రకాల సంప్రదాయ రంగుల్ని ఒంటిపై చల్లుకుని వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవడం ఈ పండుగలోని ప్రధాన ఉద్దేశం. ఆరోగ్య సూత్రంగా ఉత్తరాదిన ప్రారంభమైన పండుగ ప్రస్తుతం దేశమంతటా విస్తరించింది. సంప్రదాయ రంగుల స్థానాన్ని రసాయన రంగులు ఆక్రమించడంతో ఆరోగ్య, మానసిక సమస్యలు పండుగలోని ఆనందాన్ని హరించివేస్తున్నాయి.



- ఆరోగ్య సూత్రమే అసలు రహస్యం
- సంప్రదాయ రంగులతోనే మేలు
- రసాయనిక రంగులతో వ్యాధులు
- నేడు హోలీ పండగ

(విశాఖపట్నం/ సింహాచలం, ఆంధ్రజ్యోతి)

కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా భారతీయులంతా జరుపుకొనే ఏకైక పండుగ హోలీ. స్త్రీ పురుష, వయోభేదాలకు అతీతంగా, పేద, ధనిక తారతమ్యాల్లేకుండా సంబరంగా జరుపుకునే పండగ. శుక్రవారం హోలీ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

పురాణాల ప్రకారం హోలీ పండుగ విశిష్టతపై పలు కథనాలు ఉన్నప్పటికీ వేసవి ప్రారంభమయ్యే సమయంలో వ్యక్తిగత ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహించుకునే పండగ. సీజన్ మారుతున్నప్పుడు వాతావరణంలో తీవ్రమైన మార్పులు వచ్చి వైరల్ జ్వరాలు, జలుబు వచ్చే అవకాశాలు అధికం. వీటి నుంచి తట్టుకునేందుకు సహజసిద్ధమైన రంగుల పొడులను శరీరంపై చల్లుకుంటే అవి దివ్య ఔషధంగా పనిచేసి రోగనిరోధకశక్తిని పెంచి సహజసిద్ధమైన రక్షణ కవచంగా ఏర్పడతాయనేది నమ్మకం. కాగా సంప్రదాయ రంగుల స్థానంలో రసాయనిక రంగుల ప్రవేశం శారీరక రుగ్మతలకు కారణమవుతోంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

రంగులు చిమ్మేటప్పుడు శరీరంలోని ఏ భాగంపై పడతాయో చెప్పలేం. ఒక్కోసారి కళ్లు, ముక్కులోకి వెళ్లవచ్చు. ఇలా జరిగితే ప్రమాదం. కాబట్టి ముందు జాగ్రత్తలు తప్పనిసరి. కళ్లను పూర్తిగా కప్పేలా గూగుల్స్ (కళ్లజోళ్లు) పెట్టుకోవాలి. ముక్కుకు మాస్క్ వాడడం మంచిది. శరీరం అంతా కప్పి ఉండేలా దుస్తులు వేసుకోవాలి. సంప్రదాయ రంగులతో ఆరోగ్యానికి మేలు. వాటిని మనమే తయారు చేసుకోవచ్చు. బీట్‌రూట్, క్యారెట్, పచ్చటి కూరగాయలతో హోలీ రంగులు తయారు చేసుకోవచ్చు. పసుపు, కుంకుమ, పలు రంగుల్లో ఉన్న బంతిపూలతో పొడులు తయారు చేసుకుని వాడుకోవచ్చు.

సింహాచలంలో డోలోత్సవం

హోలీ పండగను డోలోత్సవం, కాముని పౌర్ణమి అని కూడా వ్యవహరిస్తారు. ఈ పండగను అన్ని వయసుల వారు రంగులు చల్లుకుంటూ ఆనందంగా నిర్వహిస్తారు. ఇదే రోజున కామదహనం జరిగినట్టు పురాణేతిహాశం. పార్వతీదేవి పరమేశుని వివాహమాడాలని భావించి దేవతల సహకారం కోరుతుంది. వారు మన్మథునికి ఈ బాధ్యతను అప్పగిస్తారు. మన్మథుడు పరమేశ్వరునిపై శరసంధానం చేస్తాడు. ఈశ్వరుడు ఆగ్రహించి మూడో నేత్రాన్ని తెరవడంతో దహనమవుతాడు. అప్పటి నుంచి ఫాల్గుణమాస పౌర్ణమి రోజున కామదహనం చేయడం ఆనవాయితీ. ఇక రాక్షస రాజైన హిరణ్యకశ్యపుడు అపరిమిత శక్తులను పొందాలని ఘోర తపస్సు చేసి బ్రహ్మ సాక్షాత్కారం పొందుతాడు. అతని కుమారుడు ప్రహ్లాదుడు మహావిష్ణు భక్తుడు. ఆగ్రహించిన హిరణ్యకశ్యపుడు తన కుమార్తె హోలిక ఒడిలో ప్రహ్లాదుని కూర్చుండబెట్టి చితిపై పెట్టి దహించాలని చూస్తాడు. విష్ణు ప్రభావంతో ప్రహ్లాదుడు బయటపడగా హోలిక దహనమవుతుంది. హోలిక త్యాగానికి గుర్తుగాజరుపుకుంటారు. ఇక కృష్ణుని ఛాయను గేలి చేస్తూ రాధ, చెలికత్తెలు రంగులు పూసి డోలాయమానం గోవిందం అంటూ డోలిక (ఊయల)లో ఊపడంతో వారికి పుణ్యఫలం దక్కుతుందని ప్రతీతి. దీంతో ఆ రోజు డోలోత్సవాన్ని నిర్వహిస్తారు. అడివివరం ఆరాధ్యదేవత పైడితలమ్మ కుమార్తెతో కల్యాణానికి అంగీకరించాలని స్వామి కోరగా ఆమె అంగీకరించడంతో స్వామి పరివారంతో కలిసి వేడుక జరుపుకోవడాన్ని డోలోత్సవంగా నిర్వహిస్తారు.

అలర్జీ రహిత రంగులు వినియోగించాలి



కెమికల్, అలర్జీ రహిత రంగులు మార్కెట్‌లో ఉన్నాయి. వీటిని మాత్రమే వాడాలి. కెమికల్స్‌తో కూడిన రంగులు వినియోగిస్తే స్కిన్ అలర్జీ, కళ్లల్లో ఇరిటేషన్, ఎగ్జిమా వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. దురదలు, మంట వెంటాడుతాయి. పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు అవసరం. ముఖ్యంగా కంటి లోపలకు రంగులు వెళ్లకుండా చూసుకోవాలి.

- డాక్టర్ పి.గురుప్రసాద్, చర్మవ్యాధుల నిపుణులు

భవనాల క్రమబద్ధీకరణపై శ్రద్ధచూపండి

» జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్



భీమిలి రెవెన్యూ డివిజనల్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మహారాణిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని కట్టడాల క్రమబద్ధీకరణపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో భీమిలి రెవెన్యూ డివిజన్ అధికారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీవో నంబర్-30 ఉద్దేశాలు, ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సూచించారు. 2019 అక్టోబరుకు ముందు జరిగిన ఆక్రమణలను పరిగణనలోకి తీసుకొని క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గాజువాక పరిధిలో భూముల క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజల సంతృప్తిని కొలమానంగా తీసుకుని రెవెన్యూ సిబ్బంది పనితీరును అంచనా వేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, ఏవో ఈశ్వరరావు, తహసీల్దార్లు, డీటీలు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విశాఖ జట్లు ఎంపిక

పెదవాల్తేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14 నుంచి 16 వరకూ కడప జిల్లా పులివెందులలోని వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు అకాడమీలో జరగనున్న 34వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అంతర్ జిల్లా కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా బాలురు, బాలికలు కబడ్డీ జట్లను గురువారం ఎంపిక చేసినట్టువిశాఖ జిల్లా సంఘం కార్యదర్శి జేఎస్వీ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

సబ్ జూనియర్ బాలురు జట్టు : డి.ప్రదీప్, టి.దుర్గాప్రసాద్, పి.శ్రీను, సీహెచ్ సంపత్, ఎం.సందీప్, డి.ప్రసాద్, ఎన్.మణికంఠ, ఆర్.కార్తీక్, జి.వేమంత్, ఎం.హేమసతీష్, బి.శ్రీను, ఎల్.హేమసుందర్, బాలురు జట్టు కోచ్‌గా కె. జయ సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, మేనేజర్‌గా ఎం.శివ ఎంపికయ్యారు.

బాలికల సబ్ జూనియర్ జట్టు : పి.ద్రాక్ష, ఎ.మేఘన, కె.పుణ్యవతి, కె.జానకి, జి.కుసుమ, కె.ప్రణీతి, వై.హారిక, కె.అనురాధ, కె. సౌమ్య, పి.అక్షయ, జి.కావ్య, సీహెచ్ పావని, బాలికల జట్టు కోచ్‌గా పి.చైతన్య (డీఎస్ఏ) వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా సంఘం కార్యదర్శి జేఎస్వీ ప్రసాద్ రెడ్డి, జాయింట్ కార్యదర్శి, సీహెచ్ గోవింద్, కోశాధికారి లక్ష్మణరావు, జాతీయ స్థాయి క్రీడాకారులు వైవీ శ్రీనివాస్, వి.కనకరాజు, వి.రామకృష్ణ తదితరులు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

నేడు ఇస్కాన్‌లో గౌరపూర్ణిమ ఉత్సవాలు

సాగర్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ సాగర్‌నగర్ మందిరంలో శుక్రవారం గౌరపూర్ణిమ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు ఇస్కాన్ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబదాసు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలతో పాటు భజనలు, సంకీర్తనలు ఉంటాయన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి సాంబదాస్, మాతాజీ నితాయిసేవనిలతో ప్రవచన కార్యక్రమంఉంటుందన్నారు. సుమారు వందల కిలోల పువ్వులతో పుష్పాభిషేకం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

పబ్లిక్ నోటీసు

[illegible] ... దండి :47.10 అడుగులు దక్షిణ దండి :29.3 అడుగులు పడమర దండి :48.7 అడుగులు ఉత్తర దండి :47.6 అడుగులు.

టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం
సెల్: 9247315759

టెన్త్ పరీక్షల పర్యవేక్షణకు 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

» డీఈవో ప్రేమ్‌కుమార్

భీమునిపట్నం (రూరల్) మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17 నుంచి జరగనున్న పదవ తరగతి పరీక్షలు విశాఖ జిల్లాలో సక్రమంగా నిర్వహించేందుకు 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురువారం భీమిలి రూరల్‌లో పరీక్షా కేంద్రాల పరిశీలనకు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ విశాఖ జిల్లా అంతా ఈ స్క్వాడ్‌లు పర్యటిస్తాయన్నారు. ప్రతి బృందంలో కనీసం 5 గురు సభ్యులు ఉంటారని, బృందంగా ఈ స్క్వాడ్ సిబ్బంది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తూ మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చూస్తారని అన్నారు. విశాఖ జిల్లాలో ఏర్పాటు చేసిన 134 కేంద్రాలను వీరు పరిశీలిస్తారని తెలిపారు. పరీక్షల పర్యవేక్షణ నిఘా కోసం జిల్లాను 14 రూట్లుగా విభజించామని, ప్రతి రూటుకు ఒక రూట్ అధికారి, సహాయ రూట్ అధికారి ఉంటారని చెప్పారు. వీరు కూడా పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. జిల్లాలో పరీక్షా పత్రాలను పోలీసు స్టేషన్‌లో భద్రపరిచామని, ప్రతిరోజూ ఉపాధ్యాయులు ఈ పరీక్షా పత్రాలను తీసుకుని పరీక్షా కేంద్రాలకు వెళతారన్నారు. అయితే 9 పరీక్షా కేంద్రాలు మాత్రం పోలీసుస్టేషన్లకు అందుబాటులో లేవని. వీటిని సి కేటగిరి కేంద్రాలు అంటారని ఇటువంటి ప్రతి కేంద్రానికి ఒక కస్టోడియన్‌ని కూడా నియమించినట్టు డీఈవో తెలిపారు.

సినిమా గైడ్

- **కోర్ట్ :** సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
- **దిల్‌రుబా :** జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర,
- **మజాకా :** రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 46, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 32 దొండకాయలు 38, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 56, అల్లం (పాతది)50, బరబాటి 36, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 48, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

అవయవదానంతో మరొకరికి ప్రాణదానం

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ » ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్డులో ర్యాలీ

బీచ్ రోడ్డు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అవయవదానం చేయడం ద్వారా ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న మరొకరికి ప్రాణదానం చేసినట్టేనని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన ర్యాలీ, సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవయవదానం చేయండి ... ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపండని పిలుపునిచ్చారు. కిడ్నీ సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే ఎటువంటి దుష్ఫలితాలుండవని వెల్లడించారు. ఆధునిక వైద్య శాస్త్రంలోని పురోగతి కారణంగా అవయవాలను మార్చి ప్రాణాలను నిలబెట్టగల సామర్థ్యం మన వైద్యులకు ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జీవన్‌దాన్ కార్యక్రమంలో భాగంగా జీవించివున్న వారు తమ అవయవాలను ఎలా దానం చేయాలో తెలుసుకోవాలన్నారు. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను సేకరించి, ప్రాణాపాయంలో ఉన్న వారికి అమర్చేందుకు వీలుగా మన దేశంలో చట్టబద్ధమైన మార్గదర్శాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రజలంతా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన అలవాట్ల ద్వారా కిడ్నీలను కాపాడుకోవాలన్నారు. కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవడం, సమస్యలు ఎదురైతే నివారణ చర్యలు పాటించడం ముఖ్యమని తెలిపారు. అవయవదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ తదితరులు



సైకత శిల్పం వద్ద విద్యార్థులు

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులతో సతమతమవుతున్న రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. డయాబెటిస్, హై బ్లడ్ ప్రెషర్ (అధిక రక్తపోటు)తో బాధపడే వారిలో కిడ్నీలు విఫలమవుతున్నాయని వివరించారు. కిడ్నీల ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇది చాలా మంచి కార్యక్రమమన్నారు. అవయవ దానానికి ప్రతి ఇక్కరి సహకారం అవసరమన్నారు. చాలామంది కిడ్నీలు, లివర్ పాడై అవయవాల మార్పు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. సకాలంలో అవి అందుబాటులోకి వస్తే మరింత మందికి ప్రాణదానం చేయవచ్చని సూచించారు. అనంతరం ఆర్‌కే బీచ్ నుంచి వైఎస్సీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైతిక శిల్పాన్ని కలెక్టర్, సీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, ఏఐఎన్‌యూ ఆస్పత్రి ఈడీ డాక్టర్ అమిత్ సాప్లే, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, డాక్టర్ జి.శ్రీధర్, డాక్టర్ ఉదయ్ దీపక్‌రావు గజారే, డాక్టర్ వి.వైష్ణవి, పలువురు నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నుంచి పిల్లల రక్షణకు ప్రత్యేక చట్టాలు



సదస్సులో పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటశేషమ్మ తదితరులు

మద్దిలపాలెం, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : లైంగిక వేధింపుల నుంచి పిల్లలకు రక్షణ కల్పించడానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటశేషమ్మ తెలిపారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన పోక్సో చట్టంపై అవగాహన సదస్సులో ఆమె మాటాడుతూ పద్దెనిమిదేళ్లలోపు బాలికలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కోసం 2012లో భారతప్రభుత్వం పోక్సో చట్టాన్ని తెచ్చిందన్నారు. లైంగిక వేధింపులు, అశ్లీల చిత్రాల నుంచి పిల్లలను రక్షించడానికి, అటువంటి నేరాల విచారణకు ఈ చట్టం ద్వారా ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేశారన్నారు. పోక్సో చట్టం ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందన్నారు. అలాగే కళాశాలల్లో ర్యాగింగ్‌లకు పాల్పడకూడదని సూచించారు. ర్యాగింగ్‌లకు పాల్పడి మంచి భవిష్యత్ నాశనం చేసుకోకూడదని హితవు పలికారు. కళాశాలలో స్నేహపూర్వకంమైన వాతవరణంతో విద్యార్థులు మెలిగి ఉన్నత భవిష్యత్‌కు నైపుణ్యం పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డెరెక్టర్ జి.జయదేవి, కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు పి.ఉమామహేశ్వరరావు, జీవీ ప్రతాప్, ప్రసన్న, లక్ష్మణరావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



ఆరిలోవ, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌కెఎల్‌నగర్‌లో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి 12వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి జల, క్షీర, పాంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. గురువారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

జిమ్ భాగస్వామిపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామశాల వ్యాపారంలో భాగస్వాముల మధ్య వివాదం నేపథ్యంలో ఒకరిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. శివాజీపాలెంలోని రామలక్ష్మీ అపార్టుమెంట్ ఆవరణలో కళ్యాణపు ప్రమీల చిన్న కుమారుడు జయకృష్ణ ఎస్కే అష్మాబీ సంయుక్తంగా వ్యాయామశాల ఏర్పాటు చేశారు. ఇందులో అష్మాబీ రూ.పది లక్షలు పెట్టుబడి పెట్టారు. భాగస్వాముల మధ్య విభేదాలు రావడంతో అగ్రిమెంట్ ప్రకారం కళ్యాణపు జయకృష్ణకు అతడి పెట్టుబడిని అష్మాబీ చెల్లించాల్సి ఉంది. ఈ నెల 3న జయకృష్ణ తన తల్లితో కలసి జిమ్‌లోకి వెళ్లారు. అక్కడ ఉన్న అష్మాబీ, ఆమె సోదరుడు ఎస్కే మున్నా, అతడి స్నేహితుడు డి.రాజేష్‌లు జయకృష్ణను బెదిరించారు, అసభ్య పదజాలంతో దూషించడంతో వారిపై కేసు నమోదు చేశారు. హెచ్సీ సత్యనారాయణ దర్యాప్తుచేస్తున్నారు

విజిలెన్స్ విచారణపై హర్షం

వెంకోజీపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూ మాజీ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డిపై విజిలెన్స్ కమిటీ వేస్తున్నట్టు అసెంబ్లీలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడంపై ఏయూలో విద్యార్థులు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, పరిరక్షణ సమితి సభ్యులు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మాజీ వీసీ పరిపాలనలో 2019-24 మధ్య జరిగిన అనేకమైన ఆర్థిక అవకతవకలు, అన్యాయాలు, అక్రమాలపై విచారణ జరపాలని, సుదీర్ఘకాలంగా ఉద్యమాలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి లోకేష్ కమిటీని నియమించడంపై పరిరక్షణ సమితి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ స్థాయిలో ఏయూ విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నోయిడాలోని అమిటీ యూనివర్సిటీలో ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో ఏయూ తరఫున పాల్గొన్న ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించారు. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగానికి చెందిన బి.గోపిచంద్, జి.దీక్షితలు ఏయూ తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. క్లే మోడలింగ్ విభాగంలో గోపిచంద్ మూడవ స్థానాన్ని, రంగోలిలో దీక్షిత నాలుగవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అభినందించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్లు నిర్మించండి

విశాఖ రెసిడెన్సీ కాలనీ ఆధ్వర్యంలో హనుమంతవాక వద్ద ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న నిరసనకారులు

ఆరిలోవ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉండే హనుమంతవాక జంక్షన్‌లో అత్యవసరంగ ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరుతూ విశాఖ రెసిడెన్సీ కాలనీ ఆధ్వర్యంలో స్థానిక రెసిడెన్స్ కాలనీ వాసులు, అపార్ట్‌మెంట్ వాసులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అసోషియేషన్ సభ్యులు ప్లకార్డులను పట్టుకొని వారి డిమాండ్‌ను వినిపిస్తూ నినాదాలు చేశారు. అలాగే.. నగరంలోని మద్దిలపాలెం, షీలానగర్, పాత గాజువాక ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోందని, ఆయా ప్రాంతాల్లో కూడా ఫ్లై ఓవర్ నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నగరంలోని ఈ ప్రాంతాల్లో ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపడితే నగర వాసులకు ఎంతో మేలు చేసినట్టు అవుతుందని పేర్కొన్నారు.

అలాగే అవసరమైన ప్రాంతాల్లో పార్కులు, గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు. బీచ్‌లో ప్రవేశాలకు ఎలాంటి రుసుములు వసూలు చేయవద్దని కోరారు.

ఆస్తి పన్ను పెంపు, స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు వద్దని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎన్.ప్రకాశరావు, బీబీ గణేష్, బి.గురప్ప, పిట్టా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డబ్బుతో భర్త పరారీ : పోలీసులకు భార్య ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త తనను మోసం చేసి డబ్బు, ద్విచక్రవాహనం, బంగారు గొలుసుతో పరారయ్యాడంటూ బాధిత మహిళ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి.

జాలారి ఎండాడలో నివాసం ఉంటున్న ఇందుల దేవికి వడ్రంగి పని చేస్తున్న కిరణ్‌తో 2018లో ప్రేమ వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఈ నెల పదో తేదీన దేవి సోదరుడి బంగారు గొలుసు, రూ. లక్ష రూపాయలు, ద్విచక్రవాహనంతో భర్త కిరణ్ పరారయ్యాడు. దీనిపై బాధిత మహిళ దేవి ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొద్ది రోజులుగా తన భర్త ఓ మహిళతో ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడుతున్నాడని, ఇద్దరూ కలిసి ఒకసారి తన కంట పడ్డరని, ఆ మహిళతోనే తన భర్త పరారై ఉంటాడని దేవి ఫిర్యాదులో పేర్కొంది. పలు చోట్ల వెతికినా, భర్త ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలపింది. ఈ ఫిర్యాదుపై ఎంవీపీ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



CLASSIFIEDS

PASSPORT LOST
I SHAIK ABDUL MALIK S/o. Shaik Mahaboob Ali. Lost my Passport bearing no Y7322878 while shifting my house (in surrounding area of Gopalapatnam Police Station) on 10-01-2025. If anyone find it please kindly contact me at 9177133700.

CHANGE OF NAME
★ I, NADIMPALLI SRICHARISHMASATYALAVANYA (Old Name), W/o. Pakalapati Hari Krishnam Raju, resident of 1-142, Raindram, Bondapalli, Vizianagaram. Change my name from NADIMPALLI SRICHARISHMASATYALAVANYA (Old Name) to PAKALAPATI SRICHARISHMASATYALAVANYA (New Name). Shall henceforth be known as PAKALAPATI SRICHARISHMASATYALAVANYA (New Name), W/o. Pakalapati Hari Krishnam Raju, for all purposes.
AJV_231280

PLOTS FOR SALE
★ దువ్వాడకు దగ్గరలో వెంటనే ఇల్లు నిర్మాణానికి అనువైన ఇంటి స్థలములు కలవు. బ్యాంకు లోను సదుపాయం కూడా కలదు. సంప్రః 9133447955
AJV_231164

FLAT FOR SALE
★ Lux 3 BHK Ready to Occupy Flats at Yendada Main Road South Facing 1510 sft. Rate 81 Lakhs, including amenities, No GST. Last 2 Flats. Cont.: 7989344212
AJV_13473

WANTED
➾ Wanted Accounts Executive to work a reputed company at Guntur. Mini. 2 to 3 yrs. experience in tally. Salary 20000/- to 25000/-. Cont : 9133399257.
AJG-368

WANTED
★ అక్కయ్యపాలెంలో ప్రముఖ చిల్డ్రన్ క్లినిక్‌లో పనిచేయుటకు స్టాఫ్ (F) కావలెను. Qlf: Inter (or) MPHW. వెంటనే సంప్రదించండి. 79815 31990
AJV_231279

WANTED
➾ గుంటూరులోని ప్రముఖ కంపెనీకి కారు డ్రైవర్ కావలెను. కనీసం 10 సం.ల నుండి 15 సం.ల అనుభవం కలిగి హైఎండు కారు నడుపగల డ్రైవర్ కావలెను. సంప్రః 9133399257.
AJG-365

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

వెలిగిన విద్యుత్ దీపాలు



తాటిచెట్లపాలెం- రైల్వే న్యూకాలనీ రోడ్డులో వెలుగుతున్న దీపాలు

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెం జాతీయరహదారి జంక్షన్ నుంచి రైల్వేన్యూకాలనీ జంక్షన్ వరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న విద్యుత్‌దీపాలను జీవీఎంసీ అధికారులు గురువారం వెలిగించారు. 'చీకటిపడితే ఆ రోడ్డులో అంధకారమే' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు మరమ్మతులు చేయడంతో దీపాలు వెలిగాయి. దీంతో వాహనచోదకులు ఆనందం వ్యక్తంచేశారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు

సీతమ్మధార, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు గుడ్డ సంచులను వాడాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచుల వాడకం మానాలని శానిటేషన్ సెక్రటరీ, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. సీతమ్మధార రైతుబజార్ సమీపంలో గల దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. చైతన్యనగర్, మద్దిలపాలెం ప్రాంతాల్లో ప్లాస్టిక్ సంచులు విక్రయిస్తున్న వ్యాపారులకు అపరాధ రుసుం విధించడంతో పాటు నిషేధంపై వారికి అవగాహన కల్పించారు.

ఘనంగా అన్నసమారాధన

అల్లిపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రేణుక ఎల్లమ్మతల్లి జాతర సందర్భంగా గురువారం అన్నసమారాధన చేశారు. బి.పోలారావు, సూర్యనారాయణమూర్తి, వెంకట అప్పలనాయుడు, నీలకంఠం, ప్రసాద్ సహకరించారు.

వైభవంగా అనంతుని రథోత్సవం

» అడుగడుగునా భక్తుల నీరాజనం

పద్మనాభం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభుని రథయాత్ర గురువారం రాత్రి అత్యంత వైభవంగా సాగింది. అంతకుముందు నిత్యహోమం, మహాశాంతి హోమం, సర్వ దైవశ్చహోమం, నవకుంబారాధన, స్వామివారి గ్రామ బలిహరణ నిర్వహించారు. అనంతరం కృష్ణాపురం, పద్మనాభం, అర్చకునిపాలెం, ఇసకలపాలేనికి చెందిన రైతులు సంప్రదాయం మేరకు రథానికి పూజలు చేసి తాళ్లు కట్టారు. సాయంత్రం నిత్య హోమం, గ్రామ బలిహరణ, రథాంగ హోమం, మహిళలు లక్ష్మీ సన్నిధిలో దీపారాధన చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన అనంతుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిపై ఊరేగింపుగా తీసుకువచ్చి రథాన్ని అధిరోహింపజేశారు. అనంతరం రథం ఎదురుగా కుంభం వేశారు. ఆలయ దివిటీ, మేళంతో వెళ్లి పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్‌ను ఆహ్వానించారు. సీఐ దంపతులు తొలిపూజ చేసిన అనంతరం భక్తుల హరినామస్మరణతో రథాన్ని సుంకర, కనకల, తాలాడ, సురాల, మొకర, అవనాపు తదితర కుటుంబాలకు చెందిన వారు లాగారు. గ్రామ సందర్శనలో భాగంగా రథంపై విహరిస్తున్న స్వామికి భక్తులు విశేష పూజలు, అర్చనలు చేశారు. ఉత్సవంలో భాగంగా అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం అనంతుని పరస జరిగింది. స్వామి, అమ్మవార్లు ఆలయానికి తిరిగి రావడంతో రథోత్సవం ముగిసింది. ఈకార్యక్రమంలో ఈఓ నానాజీ, అర్చకులు పి.సీతారామాంజనేయస్వామి పాల్గొన్నారు.

స్వర్ణ నారసింహుడిగా అప్పన్న దర్శనం

సింహాచలం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనారసింహుడు భక్తులకు గురువారం స్వర్ణ నారసింహుడిగా దర్శనమిచ్చాడు. కొన్నేళ్ల క్రితం రాజమహేంద్రవరానికి చెందిన భక్తుడు స్వర్ణ నారసింహ కవచాన్ని తయారు చేయించి విరాళంగా సమర్పించారు. కొంత కాలంగా పలువురు భక్తుల దర్శనార్థం ప్రతి బుధవారం రాత్రి ఆరాధన సమయంలో స్వర్ణ కవచాన్ని స్వామికి అలంకరించి మరుసటి రోజు అనగా గురువారం రాత్రి ఆరాధన సమయం వరకు స్వర్ణ కవచంతోనే సింహాద్రినాథుని దర్శనం భక్తులకు కలిపిస్తున్నారు. దీంతో గురువారం స్వామి భక్తులకు స్వర్ణ నారసింహుడిగా దర్శనం ఇస్తున్నారు.

బృందావన్ పార్కులో అభివృద్ధి పనులకు శ్రీకారం

సీతమ్మధార, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 24వ వార్డు టీపీటీ కాలనీ బృందావన్ పార్కులో అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్ శివప్రసాద్, బీజేపీ నేత, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామల దీపిక, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు రూ.10.77 లక్షలతో పార్కు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జెడ్సీ శివప్రసాద్


కార్యక్రమంలో శ్యామలా దీపిక, కార్పొరేటర్ ఉషశ్రీ

వెంకటేశ్వర కాలనీలో...

అక్కయ్యపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు వేంకటేశ్వరకాలనీలో రూ.14 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక గురువారం శంకుస్థాపన చేశారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, టీడీపీ, బీజేపీ నాయకులు శ్రీదేవి, రఘునాథ్, ఏఈ రమణమ్మ పాల్గొన్నారు.

విశాఖ, షాలిమార్, చెర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-షాలిమార్, విశాఖ-చెర్లపల్లి మధ్య ఒక ట్రిప్పు (రానుపోను) ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-షాలిమార్-విశాఖ: 08577 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 16 ఉదయం 11.30 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు వేకువజామున 3 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 17 ఉదయం 5 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-చెర్లపల్లి-విశాఖ: 08579 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 16న సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 8 గంటలకు చెర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08580 నంబరు గల ప్రత్యేక రైలు 17న ఉదయం 10 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 10 గంటలకు విశాఖ చేరుతుంది.

చెర్లపల్లి, నహర్లగున్ మధ్య

దువ్వాడ మీదుగా చెర్లపల్లి, నహర్లగున్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు ప్రవేశపెట్టామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07046 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 15, 22, 29న (ప్రతి ఆదివారం) ఉదయం 8.40 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి రాత్రి 9.13 గంటలకు దువ్వాడ, సోమవారం సాయంత్రం 4 గంటలకు నహర్లగున్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07047 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 18, 25, ఏప్రిల్ 1న (ప్రతి మంగళవారం) మధ్యాహ్నం ఒంటి గంటకు నహర్లగున్‌లో బయలుదేరి గురువారం ఉదయం 8.15 గంటలకు దువ్వాడ, రాత్రి 9.30 గంటలకు చెర్లపల్లి చేరుతుంది.

బీచ్‌లో గుర్తు తెలియని మృతదేహం

మహారాణిపేట, మార్చి13 (ఆంధ్రజ్యోతి): సాగర తీరంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు మహారాణిపేట పోలీసులు తెలిపారు. నోవాటెల్ హోటల్ ఎదురుగా సముద్రంలో సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో తీరానికి కొట్టుకువచ్చిందన్నారు. నాలుగురోజుల క్రితం సముద్రంలో పడి మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచి, కేసు నమోదు చేశామన్నారు. వివరాలు తెలిసిన వారు మహారాణిపేట పోలీసులను సంప్రదించాలన్నారు.

రైల్వే స్టేషన్‌లో 11 కేజీల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని 11 కేజీల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, జీఆర్పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి సిబ్బందితో గురువారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో తెలంగాణకు చెందిన చిరుమావిళ్ల గోపి గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. అతడిని కోర్టుకు తరలించారు.

ఉడా కాలనీలో అగ్ని ప్రమాదం

మురళీనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 51వవార్డు మాధవధార ఉడాకాలనీలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. కాలనీలోని ఎంఐజీ-146 నిమిష్ విహార్ గ్రూప్ హౌస్‌లోని దిగువ అంతస్తు ఫ్లాట్‌లో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఏసీ నుంచి మంటలు వ్యాపించినట్టు ఇంటి యజమాని వెంకటరావు తెలిపారు. అప్రమత్తమై బయటకు వచ్చేసి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చామన్నారు. ప్రమాదంలో సామగ్రి కాలి బూడిదయ్యాయి. మర్రిపాలెం ఫైర్‌స్టేషన్ సిబ్బంది మంటల్ని అదుపు చేశారు. ఫైర్ ఆఫీసర్ ఏడీఎఫ్ఓ ప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది అర్జున్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఏసీ పెద్ద శబ్దంతో పేలిపోవడంతో చుట్టుపక్కల జనం అక్కడకు చేరుకున్నారు.

క్రీడా పోటీల్లో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ

మహారాణిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర వైద్య కళాశాలల క్రీడా పోటీల్లో ఏఎంసీ విద్యార్థులు ప్రతిభ కనబరిచా రు. గన్నవరంలోని సిద్ధార్థ వైద్య కళాశాలలో ఈ నెల 8 నుంచి జరిగిన పోటీల్లో ఏఎంసీ జట్టు విజేతగా నిలిచింది. బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయస్థానం సాధించారు. విజేతలను ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ భానుసతీశ్, పీడీ డాక్టర్ ఎంఎస్ఎస్.పాత్రుడు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతకు పెద్దపీట వేయండి: కలెక్టర్

డాబాగార్డెన్స్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు పెద్దపీట వేయాలని కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో హౌసింగ్ శాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎంఏవైలో ఇళ్లు మంజూరై వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న వాటికి అదనంగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీవీటీజీల అసంపూర్తి గృహాలను పూర్తి చేయడానికి అదనపు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. జిల్లాలో పీఎంఏవై అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటి, రెండో ఆప్షన్‌లో 24,696 గృహాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 81,619 మంది లబ్ధిదారులకు రూ.43.4 కోట్ల అదనపు సాయం అందుతుందన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పనపై లేఅవుట్ల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో గృహనిర్మాణ శాఖ పీడీ సత్తిబాబు, డీఈలు సూర్యారావు, నారాయణప్రసాద్, లేఅవుట్ ఇన్‌చార్జులు, ఏసీడీలు రమణమూర్తి, వర్మ, సోమన్నారాయణ, యూసీడీ పీడీ సత్యవేణి, డీసీవో ప్రవీణ, ఎస్‌డీసీలు శేష శైలజ, సునీత పాల్గొన్నారు.


రచయిత్రి మొల్లకు నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఆదర్శ కవయిత్రి మొల్ల

కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. మొల్ల రచనా శైలి, జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు.జేసీ మయూర్ అశోక్, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, చిరంజీవులు పాల్గొన్నారు.

ఆందోళన వీడితే మీదే విజయం

అక్కయ్యపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా ఆందోళన వీడితే విజేతలుగా నిలుస్తారని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు అన్నారు. గ్రేటర్ 26వ వార్డు శంకువానిపాలెంలోని వాగ్దేవి పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను నిర్వహించారు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ బాగా చదివి, పరీక్షలు రాసి ఎక్కువ మార్కులు సాధించి అత్యున్నత స్థాయిలో నిలవాలన్నారు. విద్య నేర్పిన గురువులను, తల్లిదండ్రులను మరచిపోకూడదని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో రమేష్‌చంద్‌జైన్, ఎంపీ రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీవీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఎల్ శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో దుకాణాలకు భరోసా ఇవ్వండి

మురళీనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో దుకాణాల దగ్గర ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం సూచించాలని గురువారం వర్తకులు మాధవధార ఎయిర్‌పోర్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులకు వినతి పత్రం అందించారు. ఉత్తర నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పి.చంద్రశేఖర్‌తో కలిసి కంచరపాలెం మెయిన్ రోడ్డు వర్తకులు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కంచరపాలెం మార్కెట్ వర్తక సంఘం అధ్వర్యంలో నడుస్తున్న ఈ మార్కెట్‌లో జీవనోపాధి పొందుతున్నామని, మార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి లోపలకు ఉందన్నారు. మెయిన్ రోడ్డులో తోపుడు బళ్లు, ఫ్రూట్ షాపులు పెట్టి మెట్టు జంక్షన్‌ను గందరగోళం చేస్తున్నారన్నారు. వీరికి కంచరపాలెం బ్రిడ్జి కింద దుకాణాలిచ్చినా, ఇక్కడే వ్యాపారం చేస్తుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయని, సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.


ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసు స్టేషన్ ఎదుట కార్మికులు

పేదలకు తోపుడు బండ్ల పంపిణీ

అల్లిపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలోని 33వ వార్డులో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, జనసేన నేత గోపీకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ జెండాను గురువారం ఆవిష్కరించారు. అనంతరం పేద కుటుంబాల ఉపాధి కోసం తోపుడు బండ్లను పంపిణీ చేశారు. పిఠాపురంలో శుక్రవారం జరగనున్న సభకు అధికసంఖ్యలో తరలివెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన అధ్యక్షుడు ఆకుల రాజు, జన సైనికులు పాల్గొన్నారు.

వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరం

కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వికాస్ పాండే

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరమని, వినియోగదారుల హక్కుల కౌన్సిల్ జాతీయ ప్రెసిడెంట్ డాక్టర్ వికాస్ పాండే పేర్కొన్నారు. వినియోగదారుల అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం దసపల్లా హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతిరోజూ అనేక వస్తువులను కొనుగోలు చేస్తుంటామని, అనేకచోట్ల మోసపోతుంటారని, వాటిపై ప్రజలకు అండగా కౌన్సిల్ ఉంటుందన్నారు. వినియోగదారులకు హక్కులపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 15న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాతీయ సదస్సు, ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వశాఖలకు చెందిన ఉన్నతాధికారులు సదస్సుకు హాజరవుతారన్నారు. నగరంలోని ప్రజలంతా హాజరుకావచ్చని, ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సప్లై ఆఫీసర్ మురళీనాథ్, జాతీయ కార్యదర్శి చంద్రశేఖర్, అధికార ప్రతినిధి బాలకృష్ణ, సంస్థ నేషనల్ ఆడిటర్ ఎన్ఎస్‌వీ ప్రసాద్, సభ్యులు విక్రమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిలో అదనంగా 18.75 మెగావాట్ల సోలార్ పవర్

» మే నాటికి ఎఫ్‌జీడీ పనులు పూర్తి

» ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ సమీర్ శర్మ

విశాఖపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పరవాడలోని సింహాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంటు ఉందని, అదనంగా 18.75 మెగావాట్లతో మరొకటి ఏర్పాటు చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ తెలిపారు. విశాఖపట్నంలోని నోవాటెల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఇతర అధికారులతో కలిసి మాట్లాడారు. ఏలేరు కాలువకు మరమ్మతులు జరుగుతున్నప్పటికీ సింహాద్రికి నీటి సమస్య లేదన్నారు. ప్రత్యేకంగా రిజర్వాయర్ ఉందని, 85 శాతం ప్లాంటు అవసరాలకు సముద్రపు నీటినే ఉపయోగిస్తున్నందున ఇబ్బందులు లేవన్నారు. రాష్ట్రంలో పగటి పూట ఎక్కువ సోలార్ విద్యుత్ అందుబాటులో ఉన్నందున ప్లాంటు లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) 70 శాతంగా ఉందని, డిమాండ్ పెరగడం, సోలార్ విద్యుత్ అందుబాటులో లేకపోవడం వల్ల పీఎల్ఎఫ్ 90 శాతానికి చేరుతున్నదన్నారు.ప్లాంటు నుంచి కాలుష్యం తగ్గించడానికి ఫ్లూ గ్యాస్ డీ సల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) విధానం అమల్లోకి తెచ్చామని, నాలుగు యూనిట్లకు చిమ్నీలను మారుస్తున్నామన్నారు. వీటికి నైట్రోజన్ ఆక్సైడ్ బర్నర్‌లు అమర్చాలన్నారు. రూ.870 కోట్లతో ఈ ప్రాజెక్ట్ చేపట్టామని, ఈ మార్చికే పనులు పూర్తి కావాల్సి ఉందని, ఇప్పటికి రెండు చిమ్నీలు పూర్తయ్యాయని, మిగిలినవి మే చివరికి పూర్తవుతాయన్నారు. ప్లాంటు నుంచి వస్తున్న ఫ్లైయాష్‌ను ఇటుకల తయారీదారులకు, సిమెంట్ పరిశ్రమలకు, జాతీయ రహదారుల నిర్మాణానికి సరఫరా చేస్తున్నామన్నారు. సమావేశంలో జనరల్ మేనేజర్ (ఓఅండ్ఎం) వీకే జెనా, జనరల్ మేనేజర్ పద్మప్రియ, ఏజీఎంవి.జయన్, హెఆర్‌హెడ్ పాత్ర పాల్గొన్నారు.





ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డిపై విచారణ

... 5వ పేజీ తరువాయి

మైదానాన్ని తయారుచేసేందుకు కొందరు బయటి వ్యక్తులు నిధులు ఇచ్చారు. ఎంత ఇచ్చారు?, ఎంత ఖర్చు చేశారన్నది ఎవరికీ తెలియదు. ఈ నిధుల వినియోగం లెక్క తేల్చాల్సి ఉంది.

- వాహనాలకు డీజిల్ బిల్లుల్లోనూ అడ్డగోలుగా మెక్కేసినట్టు ఆరోపణలున్నాయి. పాడైనవాహనాల విక్రయించడం (స్క్రాప్)లోనూ అవకతవకలు జరిగాయంటారు.
- వీసీ చాంబర్‌ను ప్రసాదరెడ్డి పూర్తిగా వైసీపీ కార్యాలయంగా మార్చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి సీఎం జగన్, దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి, అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి పుట్టినరోజు వేడుకలను జరిపారు.
- అనేక కోర్సులను పూర్తిగా ఎత్తేశారు. ఫీజులను ఇష్టానుసారంగా పెంచేశారు. తనకు నచ్చని ఎంతోమంది గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించారు.
- రాష్ట్రంలో మరే వర్సిటీలో లేనివిధంగా ఎయిడెడ్ ఫ్యాకల్టీని వర్సిటీలోకి తీసుకువచ్చారు. ఇందుకు భారీగానే వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

పెరుగుతున్న బైక్ ప్రమాదాలు

... 5వ పేజీ తరువాయి

ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాల సంఖ్య రానురాను పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. 2023లో ద్విచక్ర వాహన ప్రమాదాలు 350 జరిగితే అందులో 95 మంది వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. 2024లో 295 ద్విచక్ర వాహనాలు రోడ్డు ప్రమాదానికి గురైతే 130 మంది ప్రాణాలు కోల్పోయారు. 2025లో జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే 54 బైక్‌లు ప్రమాదాలకు గురైతే...దాదాపు 21 మంది మృతిచెందడం విశేషం. ఏటేటా ద్విచక్ర వాహన ప్రమాదాలు, వాటితోపాటు మరణాల సంఖ్య కూడా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కొందరు అపరిమిత వేగంతో వాహనాలు నడుపుతూ హఠాత్తుగా ఏదైనా అడ్డువస్తే అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నెల ఐదో తేదీ రాత్రి రైల్వేన్యూకాలనీ-కంచరపాలెం రోడ్డులో బైక్ రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఆరున తెల్లవారుజామున హనుమంతవాక జంక్షన్‌లో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. అదేరోజు హెచ్‌పీసీఎల్ గేటు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. గురువారం ఉదయం కూర్మన్నపాలెం జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడే ప్రాణాలు కోల్పోయారు.

పోలీసుల అవగాహన కల్పిస్తున్నా బేఖాతరు

వాహనాన్ని అపరిమిత వేగంతో నడపడం వల్ల ఎదురయ్యే అనర్థాలు, ప్రమాదం జరిగిన తర్వాత పరిస్థితులపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మైనర్ డ్రైవింగ్, అధిక శబ్దం ఇచ్చే సైలెన్సర్లతో కూడిన వాహనాలను నడిపే వారిపై కేసులు నమోదుచేస్తున్నారు. అయినప్పటికీ ప్రయోజనం కనిపించడం లేదు.

70 ఏళ్లు దాటితే ఆయుష్మాన్ వయో వందన కార్డులు

... 5వ పేజీ తరువాయి

కవరేజీ పరిధిలోకి వచ్చే వ్యక్తులు, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం సభ్యులు ఈ పథకం కింద ప్రయోజనం పొందేందుకు అర్హులన్నారు. జిల్లాలో సీనియర్ సిటిజన్లు ఆయుష్మాన్ వయో వందన కార్డులు పొందేందుకు సమీపంలోని ఎంప్యానెల్డ్ ఆస్పత్రుల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్వీయ రిజిస్ట్రేషన్‌కు ఆయుష్మాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 14555 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చునని లేదా 1800110770 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు.

క్లాప్ వాహనాలకు బ్రేక్?

... 5వ పేజీ తరువాయి

బాగానే నడుపుతున్నానని, బిల్లులు మాత్రం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేయడం షరామామూలుగా మారిపోయింది. ఈ విషయాన్ని అధికారులు కూడా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలదృష్టికి తీసుకువెళ్లడం, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఫిర్యాదులే వస్తుండడంతో క్లాప్ వ్యవస్థపై సమీక్షించాలని నిర్ణయించారు. క్లాప్ వాహనాలకు రూ.64 వేలు అద్దె చెల్లించడం కంటే, ఏ నగరానికి ఆ నగరం గతంలో మాదిరిగా చెత్త సేకరణ వాహనాలకు సంబంధించి టెండర్లు పిలుచుకుంటే ఎలా ఉంటుందనే దానిపై చర్చిస్తున్నట్టు సమాచారం. నగరాన్ని కొన్ని క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టర్‌కు అవసరమైన వాహనాలను సమకూర్చేలా టెండర్లు ఆహ్వానిస్తే చెత్త సేకరణ మెరుగుపడుతుందని అధికారులు అభిప్రాయపడినట్టు తెలిసింది. ఇటీవల నగరానికి వచ్చిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభి వద్ద క్లాప్ వాహనాల పనితీరు గురించి అధికారులు ప్రస్తావించగా, క్లాప్ వ్యవస్థను రద్దు చేసే యోచనలో ఉన్నట్టు పరోక్షంగా సంకేతాలిచ్చారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కలెక్టర్ సమీక్ష

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమాలను వార్డు స్థాయి ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పీ4 సర్వేను 18వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ పి.శివప్రసాదరాజు, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్‌వీ నరేష్, సీసీపీ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి


జగదీష్, కార్పొరేటర్లు బొండా జగన్, ఎం.ముత్యాలునాయుడు, టీడీపీ నాయకుడు నల్లారు సూర్యనారాయణలు టిప్పర్ యజమానితో మాట్లాడారు. ఒక్కొక్కరికి రూ.4 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరించడంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. నక్కా కృష్ణకు భార్య సింహాచలం, ఇద్దరు కుమార్తెలు, ద్రోణాద్రి రాంబాబుకు భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమా నీలకంఠుడి హుండీ ఆదాయం రూ.2.59 లక్షలు

సీతమ్మధార, మార్చి 13, (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 24వ వార్డులో గల నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని గురువారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. ఆలయంలో 91 రోజులకు గాను హుండీల ద్వారా భక్తులు రూ.2,59,474 సమర్పించుకున్నారు. సేవా పీఠం భక్తులు హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై స్థానికులకు అవగాహన

కంచరపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో ప్రజలు సరైన పాత్ర పోషించాలని కంచరపాలెం సీఐ రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గాంధీనగర్‌లో గురువారం అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.





హోలీ.. రంగేళి!

అలర్జీ రహిత రంగులు వినియోగించాలి



కెమికల్, అలర్జీ రహిత రంగులు మార్కెట్‌లో ఉన్నాయి. వీటిని మాత్రమే వాడాలి. కెమికల్స్‌తో కూడిన రంగులు వినియోగిస్తే స్కిన్ అలర్జీ, కళ్లల్లో ఇరిటేషన్, ఎగ్జిమా వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. దురదలు, మంట వెంటాడుతాయి. పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు అవసరం. ముఖ్యంగా కంటి లోపలకు రంగులు వెళ్లకుండా చూసుకోవాలి.

- డాక్టర్ పి.గురుప్రసాద్, చర్మవ్యాధుల నిపుణులు

హోలీ రంగుల పండుగ. సీజన్‌మారే సంధికాలంలో శరీరాన్ని చుట్టుముట్టే వ్యాధుల నుంచి రక్షణ కోసం పలు రకాల సంప్రదాయ రంగుల్ని ఒంటిపై చల్లుకుని వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవడం ఈ పండుగలోని ప్రధాన ఉద్దేశం. ఆరోగ్య సూత్రంగా ఉత్తరాదిన ప్రారంభమైన పండుగ ప్రస్తుతం దేశ మంతటా విస్తరించింది. సంప్రదాయ రంగుల స్థానాన్ని రసాయన రంగులు ఆక్రమించడంతో ఆరోగ్య, మానసిక సమస్యలు పండుగలోని ఆనందాన్ని హరించివేస్తున్నాయి.



- ఆరోగ్య సూత్రమే అసలు రహస్యం
- సంప్రదాయ రంగులతోనే మేలు
- రసాయనిక రంగులతో వ్యాధులు
- నేడు హోలీ పండగ

(విశాఖపట్నం/ సింహాచలం, ఆంధ్రజ్యోతి)

కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా భారతీయులంతా జరుపుకొనే ఏకైక పండుగ హోలీ. స్త్రీ పురుష, వయోభేదాలకు అతీతంగా, పేద, ధనిక తారతమ్యాల్లేకుండా సంబరంగా జరుపుకునే పండగ. శుక్రవారం హోలీ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

పురాణాల ప్రకారం హోలీ పండుగ విశిష్టతపై పలు కథనాలు ఉన్నప్పటికీ వేసవి ప్రారంభమయ్యే సమయంలో వ్యక్తిగత ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వహించుకునే పండగ. సీజన్ మారుతున్నప్పుడు వాతావరణంలో తీవ్రమైన మార్పులు వచ్చి వైరల్ జ్వరాలు, జలుబు వచ్చే అవకాశాలు అధికం. వీటి నుంచి తట్టుకునేందుకు సహజసిద్ధమైన రంగుల పొడులను శరీరంపై చల్లుకుంటే అవి దివ్య ఔషధంగా పనిచేసి రోగనిరోధకశక్తిని పెంచి సహజసిద్ధమైన రక్షణ కవచంగా ఏర్పడతాయనేది నమ్మకం. కాగా సంప్రదాయ రంగుల స్థానంలో రసాయనిక రంగుల ప్రవేశం శారీరక రుగ్మతలకు కారణమవుతోంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

రంగులు చిమ్మేటప్పుడు శరీరంలోని ఏ భాగంపై పడతాయో చెప్పలేం. ఒక్కోసారి కళ్లు, ముక్కులోకి వెళ్లవచ్చు. ఇలా జరిగితే ప్రమాదం. కాబట్టి ముందు జాగ్రత్తలు తప్పనిసరి. కళ్లను పూర్తిగా కప్పేలా గూగుల్స్ (కళ్లజోళ్లు) పెట్టుకోవాలి. ముక్కుకు మాస్క్ వాడడం మంచిది. శరీరం అంతా కప్పి ఉండేలా దుస్తులు వేసుకోవాలి. సంప్రదాయ రంగులతో ఆరోగ్యానికి మేలు. వాటిని మనమే తయారు చేసుకోవచ్చు. బీట్‌రూట్, క్యారెట్, పచ్చటి కూరగాయలతో హోలీ రంగులు తయారు చేసుకోవచ్చు. పసుపు, కుంకుమ, పలు రంగుల్లో ఉన్న బంతిపూలతో పొడులు తయారు చేసుకుని వాడుకోవచ్చు.

సింహాచలంలో డోలోత్సవం

హోలీ పండగను డోలోత్సవం, కాముని పౌర్ణమి అని కూడా వ్యవహరిస్తారు. ఈ పండగను అన్ని వయసుల వారు రంగులు చల్లుకుంటూ ఆనందంగా నిర్వహిస్తారు. ఇదే రోజున కామదహనం జరిగినట్లు పురాణేతిహాసం. పార్వతీదేవి పరమేశుని వివాహమాడాలని భావించి దేవతల సహకారం కోరుతుంది. వారు మన్మథునికి ఈ బాధ్యతను అప్పగిస్తారు. మన్మథుడు పరమేశ్వరునిపై శరసంధానం చేస్తాడు. ఈశ్వరుడు ఆగ్రహించి మూడో నేత్రాన్ని తెరవడంతో దహనమవుతాడు. అప్పటి నుంచి ఫాల్గుణమాస పౌర్ణమి రోజున కామదహనం చేయడం ఆనవాయితీ. ఇక రాక్షస రాజైన హిరణ్యకశ్యపుడు అపరిమిత శక్తులను పొందాలని ఘోర తపస్సు చేసి బ్రహ్మ సాక్షాత్కారం పొందుతాడు. అతని కుమారుడు ప్రహ్లాదుడు మహావిష్ణు భక్తుడు. ఆగ్రహించిన హిరణ్యకశ్యపుడు తన కుమార్తె హోలిక ఒడిలో ప్రహ్లాదుని కూర్చుండబెట్టి చితిపై పెట్టి దహించాలని చూస్తాడు. విష్ణు ప్రభావంతో ప్రహ్లాదుడు బయటపడగా హోలిక దహనమవుతుంది. హోలిక త్యాగానికి గుర్తుగా జరుపుకుంటారు. ఇక కృష్ణుని ఛాయను గేలి చేస్తూ రాధ, చెలికత్తెలు రంగులు పూసి డోలాయమానం గోవిందం అంటూ డోలిక (ఊయల)లో ఊపడంతో వారికి పుణ్యఫలం దక్కుతుందని ప్రతీతి. దీంతో ఆ రోజు డోలోత్సవాన్ని నిర్వహిస్తారు. అడివివరం ఆరాధ్యదేవత పైడితలమ్మ కుమార్తెతో కల్యాణానికి అంగీకరించాలని స్వామి కోరగా ఆమె అంగీకరించడంతో స్వామి పరివారంతో కలిసి వేడుక జరుపుకోవడాన్ని డోలోత్సవంగా నిర్వహిస్తారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న పార్కు

పెదగంట్యాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలోని పార్కు ప్రారంభానికి సిద్ధమవుతుంది. సుమారు రూ.10 కోట్లతో పార్కులో అభివృద్ధి పనులు చేపట్టారు. మిగిలిన పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి ఏప్రిల్‌లో పార్కును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు జీవీఎంసీ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే పార్కులో చిన్నారుల ఆడుకునేందుకు సామగ్రి ఏర్పాటు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ థియేటర్, స్కేటింగ్ రింక్, వాటర్ ఫౌంటెయిన్ పనులు పూర్తయ్యాయి. గ్రీనరీ, తాగునీటి పైపు లైన్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాంపౌండ్ వాల్‌కు కళాకృతులు, క్రీడాంశాల చిత్రాలు, నాట్యకళా రీతుల చిత్రాలు ఏర్పాటు చేసే పనులను వారం రోజుల్లో ప్రారంభించనున్నారు. ఈ మేరకు గురువారం టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులతో కలిసి పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు. సకాలంలో పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఏసీ మిషన్‌లో పాము పిల్లలు

పెందుర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లోకి పాములు ప్రవేశించడం సహజం. కానీ ఏసీ మిషన్‌లో ప్రత్యక్షం కావడం విడ్డూరమే. ఇక్కడి పులగాలిపాలెంలో ఓ ఇంట్లోని ఏసీ మిషన్ నుంచి బుధవారం శబ్దాలు వస్తుండడంతో యజమాని సత్యనారాయణ దానిని పరిశీలించారు. ఏసీ మిషన్ లోపల పాములు ఉండడం చూసి భయాందోళనకు గురయ్యారు. వెంటనే గాజువాకకు చెందిన స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని ఏసీ మిషన్‌లో ఉన్న నాలుగు పాము పిల్లలను చాకచక్యంగా బయటకు తీశారు. ఇవి ప్రమాదకరమైన పాములు కావని, ఏసీలోని నీటిని బయటకు పంపే గొట్టాల్లో ఉండే ఫంగస్‌ను ఆహారంగా తినడానికి ఇవి వస్తాయన్నారు. వీటిని తాడి నాగులు అంటారని కిరణ్ పేర్కొన్నారు.



ఏసీ మిషన్ నుంచి తీసిన పాములతో కిరణ్

మృతి చెందిన ఉక్కు అధికారుల కుటుంబాలకు చేయూత

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తూ ఇటీవల కాలంలో మృతి చెందిన అధికారుల కుటుంబ సభ్యులకు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో గురువారం సీ-కార్యాలయంలో చేయూత కింద చెక్కులు అందజేశారు. ఆస్పత్రిలో జీఎంగా పనిచేసిన సుధాకర్ కుటుంబానికి రూ.3 లక్షల 30 వేలు, ఎస్ఎంఎస్ ఏజీఎంగా పనిచేసిన సోమరాజు కుటుంబానికి రూ.లక్షా 60 వేలు, అనారోగ్యంతో దీర్ఘకాలిక సెలవులో ఉన్న డీజీఎం జానా కుటుంబానికి రూ.45 వేలు అందజేశారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ.ప్రసాద్, సభ్యులు శ్రీనివాసరావు, దాలినాయుడు, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

అగనంపూడి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో గురువారం కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ చిత్రపటానికి సంఘం ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ రామాయణాన్ని తెలుగులో రచించిన తొలి తెలుగు కవయిత్రి మొల్లిమాంబ అన్నారు. గొప్ప చరిత్ర కలిగిన ఆమెను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కోసూరి తాతారావు, ఎం.తాతారావు, ఎస్.మత్స్యరాజు, జగ్గారావు, విభూషణ్, బొర్రయ్య, సింహాద్రి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి: ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఆశయం మేరకు మహా విశాఖ అభివృద్ధికి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని 'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు కోరారు. గురువారం ఆయన అసెంబ్లీలో పలు సమస్యలపై గళమెత్తారు. గత ప్రభుత్వ పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఆగిన టిడ్కో గృహ సముదాయాలకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఎన్ఏడి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మిగిలిన హైలెవెల్ కారిడార్ పనులను పూర్తి చేయాలని, సాకేతపురం కూడలిలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టాల్సి ఉందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో అనుసంధానం చేస్తూ ప్రతిపాదించిన 15 రోడ్ల అలైన్‌మెంట్ లోపభూయిష్టంగా ఉందన్నారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు, మౌలిక వసతులను కల్పించాలని పేర్కొన్నారు. విశాఖలోని పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల బాధితులకు ఇచ్చే నష్టపరిహారం విషయంలో ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని కోరారు.

18న పెన్షనర్ల నిరసన

మల్కాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్-95 కనీస పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని కోరుతూ ఈ నెల 18న దేశంలోని అన్ని కలెక్టరేట్‌ల వద్ద నిరసన చేపడుతున్నట్టు మాజీ సీబీటీ సభ్యుడు (ఈపీఎఫ్‌వో), బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.జగదేశ్వరరావులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ పెన్షన్ డీఏను జోడించాలని, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు.

కొత్త చట్టాలపై వాహనదారులకు అవగాహన ఉండాలి

- హార్బర్ సర్కిల్ ఏసీపీ కాళిదాస్

మల్కాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొత్తగా మారిన భారతీయ న్యాయ సంహిత చట్టాలపై వాహనదారులందరూ అవగాహన కలిగివుండాలని హార్బర్ సర్కిల్ ఏసీపీ కాళిదాస్ అన్నారు. విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోర్టు ఎగ్జామ్ పార్కు ఏరియాలో నూతన చట్టాలపై లారీ డ్రైవర్లకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా మారిన చట్ట ప్రకారం వాహనంతో ఒకరికి ఢీకొని పారిపోయినట్టు పోలీసుల విచారణలో రుజువైతే సెక్షన్-106 క్లాజ్-2 ప్రకారం రూ.ఏడు లక్షల వరకు జరిమానా, జైలుశిక్ష పడుతుందన్నారు. అంతేకాక ఇలాంటి కేసులో కోర్టు బెయిల్ కూడా ఇవ్వదన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 108కు, 112కు ఫోన్ చేయాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హార్బర్ పోలీస్ స్టేషన్ సీఐ సింహాద్రి నాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు పి.లక్ష్మినాయుడు, కార్యదర్శి కె.అర్జునరావు, కోశాధికారి కె.కాశీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ కాళిదాస్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

అక్కిరెడ్డిపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ మింది 11కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మింది, ఎస్సీ కాలనీ, గిరి ప్రసాద్ కాలనీ, రామ్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెందుర్తి: సుజాతనగర్ సబ్ స్టేషన్ రాంపురం 33/11కేవీ గొరపల్లి ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గొరపల్లి, కరకవానిపాలెం, ఎన్ఎస్ఆర్ లేఅవుట్, గంగమ్మపేట, కోట్నివానిపాలెం, విస్డమ్ కళశాల, గవరపాలెం, గొల్లలపాలెం, రెల్లికాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి తమకు సహకరించాలని కోరారు.





లక్ష్మీనగర్ పాఠశాలలో క్రీడల్లో పాల్గొన్న విద్యార్థినులు, పక్కన గోపాలపట్నం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు

గోపాలపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వార్షిక విద్యా సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు.

క్రీడల ముగింపోత్సవాన్ని పురస్కరించుకుని విజేతలకు బహుమతులు అందజేస్తామని హెచ్ఎం మోహనరావు తెలిపారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ పార్టీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్ఎం వేణుగోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణతతో పాటు పాఠశాలను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్టు

గాజువాక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్లను బెదిరించి దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. గాజువాక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో క్రైం ఏడీసీపీ మోహనరావు తెలిపిన వివరాలిలావున్నాయి....గంగవరం పోర్టు రోడ్డులో లారీలను ఆపి నిద్రిస్తున్న ఇద్దరు డ్రైవర్లను మదీనాబాద్‌కు చెందిన ఎస్.హరికృష్ణ, అప్పికొండకి చెందిన గరికిన శివ బుధవారం తెల్లవారుజామున బెదిరించి వారినుంచి నగదు, సెల్‌ఫోన్లు చోరీ చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టి నిందితులను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి బైక్, రెండు సెల్ ఫోన్లు, రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో ఏసీపీ లక్ష్మణరావు, ఇన్‌చార్జి సీఐ దాలిబాబు, ఎస్ఐ మన్మథరావు పాల్గొన్నారు.

నేడు ఈఎస్ఐ ఆస్పత్రిలో మహిళలకు ఉచితంగా వ్యాక్సిన్

మల్కాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా షిప్‌యార్డు సంస్థ శుక్రవారం సింధియా న్యూకాలనీ జంక్షన్‌లో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రిలో మహిళలకు గర్భా శయ క్యాన్సర్ బారినపడకుండా ఉండేందుకు గాను ఉచితంగా సెర్వవాక్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని హెచ్ఎస్ఎల్ యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని 14 నుంచి 40 ఏళ్లలోపు యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

'నీటి సమస్యను పరిష్కరిస్తాం'

కూర్మన్నపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి పాత వడ్లపూడి, అంబేడ్కర్ కాలనీల్లో బోరింగులు మరమ్మతులకు గురవ్వడం, తాగునీటి పైపు లైన్ల లీకేజీల కారణంగా సరిపడా నీరందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు మహిళలు గురువారం పర్యటనకు విచ్చేసిన కార్పొరేటర్ బొండా జగన్, నీటి విభాగ ఏఈ కేదారినాథ్ వద్ద తమ గోడును వెళ్లగక్కారు. రూ.20 లక్షలతో వాటర్ పైపు లైన్లకు మరమ్మతులు చేయించి తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.





సినిమా గైడ్

- **కోర్ట్ :** సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
- **దిల్‌రుబా :** జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర,
- **మజాకా :** రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 46, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 44, బీరకాయలు 50, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 12, క్యారెట్ 32 దొండకాయలు 38, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)7, అల్లం (పాతది) 50, బరబాటి 36, ముల్లంగి 26, మునక్కాడలు (కిలో) 56, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 48, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 64, గోరుచిక్కుడు 36, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

వైభవంగా ముత్యాలమ్మ పండగ

వేపగుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేపగుంట పరిసర 14 గ్రామాల ఆరాధ్య దేవత శ్రీముత్యాలమ్మ ప్రధాన పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. అర్ధరాత్రి రెండు గంటల నుంచే అమ్మవారి దర్శించేందుకు భక్తులు బారులుతీరారు. ఉదయం 10 గంటల సమయంలో భక్తుల క్యూ వేపగుంట రోడ్డు వరకు వచ్చింది. ఈ సందర్భంగా అమ్మవారిని వెండి మకరతోరణం, కవచంతో పాటు రూ.40 వేలు వెచ్చించి బాదంతో రూపొందించిన గజమాలతో శోభాయమానంగా అలంకరించారు. అలాగే గర్భాలయాన్ని వివిధ రకాల పండ్లు, నలభై వేల కొబ్బరి కాయలతో సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం నేలగారిడీలు, బండ్ల వేషాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ తదితర సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఘటాలను రాత్రి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా బాణసంచా కాల్పుల నడుమ తీసుకువెళ్లారు. తొలిపూజల్లో గ్రామ పెద్ద ముత్తానాయుడు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, గ్రేటర్ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు రాపర్తి కన్నా, ముమ్మన దేముడు, తదితరులు దర్శించుకున్నారు. వేపగుంట ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో 40 కిలోల చక్రపొంగళి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు శేషాద్రిశర్మ, గ్రామ పెద్దలు శేశెట్టి అప్పారావు, శ్రీను, రమణ, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకున్న ముత్యాలమ్మ

యూపీహెచ్‌సీని సందర్శించిన ఆర్‌బీఎస్‌కే బృందం

గోపాలపట్నం, మార్చి (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనగర్ యూపీహెచ్‌సీని రాష్ట్రీయ బాల స్వచ్ఛతా కార్యక్రమ్ (ఆర్‌బీఎస్‌కే) బృందం గురువారం పరిశీలించింది. ఆస్పత్రి పరిధిలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని బృంద సభ్యులు సూచించారు. టీబీ నివారణ సాధ్యమని, టీబీ సోకిన వారిని గుర్తించి వారికి మందులను పంపిణీ చేసి సంపూర్ణ టీబీ నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రామారావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిని విస్తరించాలని డీఆర్ఎంకు వినతి

అగనంపూడి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి తలారివానిపాలెం సమీపంలో గల రైల్వే ట్రాక్‌పై అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని విస్తరించాలని కోరుతూ స్థానిక కూటమి నాయకులు గురువారం వాల్తేరు డీఆర్ఎం లలిత్ బోరాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇక్కడి బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో ద్విచక్ర వాహనాలు తప్ప కార్లు, ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కారణంగా అగనంపూడి, ఉక్కు నిర్వాసిత ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో నరవ, మంగళపాలెం, పరిసర ప్రాంతాలకు దువ్వాడ మీదుగా వెళ్లాల్సి వస్తుందని వివరించారు. డీఆర్ఎంను కలిసి వారిలో నాయకులు మోటూరి వెంకటరమణ, సత్యనారాయణ, చందూరమేశ్, తాతారావు, అచ్యుత్, రామ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఐద్వా వ్యవస్థాపక దినోత్సవం

మల్కాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 59వ వార్డు పరిధి నెహ్రూనగర్ జంక్షన్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు హెచ్.సత్యవతి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు నానాటికీ పేరిగిపోతున్నాయని, అందువల్ల ప్రభుత్వాలు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు సీత, భవానీ, లక్ష్మీ, మంగ, కుసుమ, సింహాచలం, రమణమ్మ, బండియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు డైరెక్టర్‌ను కలిసిన కార్మిక నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (కమర్షియల్)గా బాధ్యతలు చేపట్టిన సలీమ్ జి పురుషోత్తమన్‌ను గురువారం టీఎన్‌టీయూసీ ప్లాంట్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రగతిపథంలో నడిపించాలని, అందుకు కార్మిక సంఘాల తరఫున పూర్తి సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని, ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందించాలని కోరారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు, యూనియన్ నాయకులు గుమ్మడి నరేంద్రకుమార్, నమ్మి సింహాద్రి, పెద్దాడ సోమినాయుడు, పొట్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు సరికాదు

స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల తొలగింపు సరికాదని విశాఖ ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు అన్నారు. టౌన్‌షిప్‌లో కార్మికుల తొలగింపు అంశంపై గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల పట్ల యాజమాన్యం ఇలా వ్యవహరించకూడదని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరెడ్డి, బాలయోగి, సురేశ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

CLASSIFIEDS

PASSPORT LOST

I SHAIK ABDUL MALIK S/o. Shaik Mahaboob Ali. Lost my Passport bearing no Y7322878 while shifting my house (in surrounding area of Gopalapatnam Police Station) on 10-01-2025. If anyone find it please kindly contact me at 9177133700.

CHANGE OF NAME

★ I, NADIMPALLI SRICHARISHMASATYALAVANYA (Old Name), W/o. Pakalapati Hari Krishnam Raju, resident of 1-142, Raindram, Bondapalli, Vizianagaram. Change my name from NADIMPALLI SRICHARISHMASATYALAVANYA (Old Name) to PAKALAPATI SRICHARISHMASATYALAVANYA (New Name). Shall henceforth be known as PAKALAPATI SRICHARISHMASATYALAVANYA (New Name), W/o. Pakalapati Hari Krishnam Raju, for all purposes.

AJV_231280

PLOTS FOR SALE

★ దువ్వాడకు దగ్గరలో వెంటనే ఇల్లు నిర్మాణానికి అనువైన ఇంటి స్థలములు కలవు. బ్యాంకు లోను సదుపాయం కూడా కలదు. సంప్ర॥ 9133447955

AJV_231164

FLAT FOR SALE

★ Lux 3 BHK Ready to Occupy Flats at Yendada Main Road South Facing 1510 sft. Rate 81 Lakhs, including amenities, No GST. Last 2 Flats. Cont.: 7989344212

AJV_13473

WANTED

⇒ Wanted Accounts Executive to work a reputed company at Guntur. Mini. 2 to 3 yrs. experience in tally. Salary 20000/- to 25000/-. Cont : 9133399257.

AJG-368

WANTED

★ అక్కయ్యపాలెంలో ప్రముఖ చిల్డ్రన్ క్లినిక్‌లో పనిచేయుటకు స్టాఫ్ (F) కావలెను. Qlf: Inter (or) MPHW. వెంటనే సంప్రదించండి. 79815 31990

AJV_231279

WANTED

⇒ గుంటూరులోని ప్రముఖ కంపెనీకి కారు డ్రైవర్ కావలెను. కనీసం 10 సం.ల నుండి 15 సం.ల అనుభవం కలిగి హైఎండు కారు నడుపగల డ్రైవర్ కావలెను. సంప్ర॥ 9133399257.

AJG-365

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176 9966165093